PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 260 | విజయవాడ, ఆదివారం 30 జులై 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 30 July 2023 | Rs

నేడు పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్ ప్రయోగం

- సింగపూర్ ఉపగ్రహంతో పాటు ఆరు నానో ఉపగ్రహాలు
- కౌంట్‌డౌన్ ప్రారంభం

లోపలి పేజీలో..

చెరువు వద్ద స్నానాలు, రొట్టెల మార్పిడి చేసుకుంటున్న భక్తులు



మతసామరస్యానికి ప్రతీక రొట్టెల పండుగ

- నెల్లూరులో ప్రారంభమైన అయిదు రోజుల వేడుక

లోపలి పేజీలో..



మణిపూర్ చేరుకున్న 'ఇండియా' ఎంపీలు

కేంద్రం నిద్రపోతోందా?

మణిపూర్‌లో హింస దేశ ప్రతిష్టకు దెబ్బ

శాంతి నెలకొందని కేంద్రం చెబుతోంది.. మరి ప్రజలెందుకు ఇళ్లకు వెళ్లడం లేదు?

అనుక్షణం తీవ్ర భయాందోళనల్లో జనం

రెండు బృందాలుగా ప్రజలను కలుసుకుంటున్న 'ఇండియా' ఎంపీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దాదాపు తొంబై రోజులుగా ఈశాన్య రాష్ట్రం మణిపూర్ తగలబడుతుంటే, కేంద్ర ప్రభుత్వం నిద్రపోతుందా? అని ప్రతిపక్ష ఎంపీలు ప్రశ్నించారు. మణిపూర్‌లో హింస దేశ ప్రతిష్టను మాత్రమే కాదు, యావత్ ఈశాన్య రాష్ట్రాల ప్రతిష్టను మంటగలుపుతోందని వారు పేర్కొన్నారు. అక్కడ శాంతి నెలకొందని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, అదే నిజమైతే ప్రజలు తమ సొంత గూటికి ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. మణిపూర్‌కు శాంతి కావాలని, అందుకు ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం 16 పార్టీలకు చెందిన 20 మంది ప్రతిపక్ష ఎంపీలు శనివారం మణిపూర్‌కు చేరుకున్నారు. పది మంది చొప్పున రెండు బృందాలుగా ఏర్పడి మణిపూర్‌లోని హింసాత్మక ప్రాంతాలను, సహాయ కేంద్రాలను సందర్శించారు. అక్కడ బాధితులను కలిసి వారి బాధలను విన్నారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుంటూ కన్నీరు మున్నీరు అయ్యారు. ప్రతిపక్ష ఎంపిలు తమ మద్దతును ప్రకటించారు. మణిపూర్‌లో శాంతి, సాధారణ పరిస్థితులు తిరిగి నెలకొనేంత వరకు మణిపూర్ ప్రజలకు అండగా ఉంటామని ఎంపిలు పేర్కొన్నారు. అలాగే కుకీ, మెయితీ తెగల నాయకులను కూడా కలిశారు. ఎంపిలు అధిర్ రంజన్ చౌదరి, పూలో దేవి నేతమ్ (కాంగ్రెస్), కనిమొళి (డిఎంకె), సుస్మిత సేన్ (టిఎంసి), ఎఎ రహీం (సిపిఎం), పి. సంతోష్ కుమార్ (సిపిఐ), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి), జావిద్ అలీ ఖాన్ (ఎస్‌పి), డి. రవి కుమార్, తిరుమవలవన్ (విసికె)లతో కూడిన ఇండియా కూటమి బృందం చురచంద్‌పూర్ కళాశాలలోని బాయ్స్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సహాయక శిబిరాన్ని సందర్శించింది. అక్కడ బాధితులతో మాట్లాడిన అనంతరం, కుకీ నాయకులు, పౌర సమాజ సభ్యులను కలుసుకుంది. అటు పిమ్మట బిష్ణుపూర్ జిల్లాలోని మోయిరాంగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాన్ని సందర్శించింది. బాధితులను ముఖ్యంగా చిన్నారులు, మహిళలను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకుంది. ఆ తరువాత హింసాత్మక

మిగతా 5లో

గోదావరి మరింత ఉధృతం

భద్రాచలం వద్ద 3వ, కాటన్ బ్యారేజీ వద్ద 2వ ప్రమాద హెచ్చరికలు కొనసాగింపు

- అంతకంతకూ పెరుగుతున్న నీటి ఉధృతితో ఆందోళన
- సురక్షిత ప్రాంతాలకు ముంపు, లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి- యంత్రాంగం

గోదావరి నది వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో శనివారం వరద ప్రవాహం మరింత ఎక్కువైంది. దీంతో, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలోని ముంపు మండలాలు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరద బాధితులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు కొందరు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. మరికొందరిని అధికారులు తరలించారు. ఇంకొందరు తమ గ్రామాలకు సమీపంలోని ఎత్తైన ప్రాంతాల్లోనూ, కొండలపైనా తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని అక్కడికి తరలివెళ్లారు. పునరావాస కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువవ్వడంతో వరద బాధితులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భద్రాచలం వద్ద మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక, ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద రెండో నెంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. భద్రాచలం వద్ద 55.90 అడుగులు, కాటన్ బ్యారేజీ వద్ద 15 అడుగుల నీటిమట్టం నమోదైంది. కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి 14,80,093 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 35 మీటర్లకు చేరింది. దిగువకు 12.80 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. పోలవరం ముంపు మండలాలైన అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాకల మండలాలను వరద చుట్టుముట్టింది. స్థానికంగా వరుణుడు కరుణించినా ఎగువ నుంచి గోదావరి, శబరి ప్రవాహాలు పెరగడంతో వందల గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కూనవరం మండలంలోని దాదాపు అన్ని గ్రామాలనూ వరద నీరు చుట్టుముట్టింది. ఇప్పటికే ఈ మండలంలోని పది పంచాయతీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇన్వర్టర్, సోలార్ పవర్ పాడైపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అత్యధిక గ్రామాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. ఇప్పటికే 31కుపైగా గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. 2,700 కుటుంబాలు పునరావాస కేంద్రాలకు, గుట్టలు, కొండలపైకి తరలివెళ్లారు. వరద పెరుగుతుండడంతో ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరి గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలవరం కాఫర్ డ్యాం వద్ద మరో రెండు మీటర్ల వరద పెరిగితే ఈ రెండు మండలాల్లోని అత్యధిక గ్రామాలు వరద ముంపులో చిక్కుకోనున్నాయి.



రోడ్డుకిరువైపులా గుడారాలు వేసుకున్న కూనవరం ప్రజలు

వరంగల్ భద్రకాళి చెరువు మట్టకట్ట కోత

తెలంగాణలోని జూరాల జలాశయం 30 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. వరంగల్ భద్రకాళి చెరువు కట్ట కోతకు గురై తెగిపోవడంతో పోతన నగర్‌ను వరద నీరు ముంచెత్తింది.

ప్రకాశం బ్యారేజీకి తగ్గిన వరద

ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం తగ్గింది. ఈ బ్యారేజీకి ఉదయం నుంచి 1.78 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చింది. మొత్తం అన్ని గేట్లూ ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. సాయంత్రానికి 1.30 లక్షల క్యూసెక్కులకు ప్రవాహం తగ్గింది. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతోపాటు పులిచింతల దిగువన, ప్రకాశం బ్యారేజి ఎగువన కురిసిన వర్షాలతో మున్నేరు, కట్టలేరు, బుడమేరు, పాలేరు తదితర ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తోంది. అయితే, గత రెండు రోజుల కన్నా ఉధృతి తగ్గింది. ప్రస్తుతం పంట కాలువలకు నీటి విడుదల నిలిపివేశారు. పులిచింతలలో మాత్రం నీటిమట్టం పెరుగుతోంది. సాగర్‌కు దిగువన, పులిచింతల ఎగువన కురిసిన వర్షాలతో 50 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా, శనివారం రాత్రికి 30.74 టిఎంసిల నీటి నిల్వ ఉంది.



పడవలో పునరావాస కేంద్రాలకు వస్తున్న సీతానగరం మండలంలో బొబ్బిల్లంక వాసులు

పూరిళ్లకు రూ.10 వేలు

- వరద సాయం జిఓ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సంభవించిన గోదావరి వరదల్లో పూరిగుడిసెలు, పాకలు కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 10 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఈ మేరకు శనివారం జిఓ ఆర్‌టి నెంబరు 42ని విడుదల చేసింది. గతంలో ఎస్‌డిఆర్‌ఎఫ్ నిబంధనల కింద రూ. 5వేలు ఆర్థిక సహాయం అందిస్తుండగా ఈనెల 28న సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆర్థిక సహాయాన్ని పెంచిన విషయం తెలిసిందే. వరద బాధితులకు తక్షణ సహాయం కింద ఉచితంగా ఒక్కో ఇంటికి 25కిలోల బియ్యం, కిలో కందిపప్పు, పామాయిల్ ఒక లీటర్, ఉల్లి గడ్డలు ఒక కిలో, బంగాళాదుంపలు కిలో ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శనివారం జీఓ ఆర్‌టి నెంబరు 41ని విడుదల చేసింది.

ఆదివాసీలకు సంక్షేమ లబ్ధి ఏదీ?

- ఏజెన్సీలో అమలు కాని పథకాలు
- గిరిజన గ్రామాల్లో కానరాని అభివృద్ధి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారార్భాటాలకే పరిమితం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ లబ్ధి అందడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివాసీలకు అన్ని సంక్షేమ పథకాలూ అందిస్తున్నామని ప్రచారార్భాటాలు తప్ప, పాలకులు చేసిందేమీ లేదని విమర్శించారు. జగనన్న ఇళ్లు ఇస్తున్నామని రాష్ట్ర వ్యాప్తంగా ఊదరగొడుతున్నారు తప్ప, ఏజెన్సీలో ఒక్క ఇంటి నిర్మాణం కూడా చేయలేదని తెలిపారు. అరకులోయలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఇళ్లకు పట్టాలిచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. పివిటిజిలు నివసిస్తోన్న గ్రామాల్లో వరదలు, వానలు, గాలుల వల్ల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఇళ్లు కూలిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. చాలా గ్రామాల్లోని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కూడా లేదన్నారు. రోడ్లు లేక గర్భిణులను డోలీ మోతతో ఆస్పత్రులకు తరలిస్తున్నా పాలకులకు పట్టడం లేదని తెలిపారు. పివిటిజిలకు గత కేంద్ర బడ్జెట్‌లో పదిహేను వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని, రాష్ట్రపతి సిఫార్సును బట్టి ఖర్చు చేస్తామని చెప్పారని, అయితే, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక పైసా కూడా ఖర్చు చేయలేదని అన్నారు. కేటాయించిన నిధులను ఎక్కడకు మళ్లించారని ప్రశ్నించారు. అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయని, వీటికి బిల్లులు రాకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. పివిటిజిల్లో అంత్యోదయ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ 35 కిలోల బియ్యం ఇవ్వాలని, సబ్సిడీతో నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. గతంలో పివిటిజిలకు ప్రత్యేక పథకాలు అమలయ్యేవని, 90 శాతం సబ్సిడీతో గొర్రెలు, పశువులు, మేకలు అందించారని, నిరుద్యోగులకు రాయితీ రుణాల సౌకర్యం కల్పించారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక వాటన్నింటినీ నిలిపేసిందని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసిందని చెప్పారు. పార్లమెంట్‌లో అటవీ పర్యావరణ సంరక్షణ చట్టం సవరణ బిల్లును ఏకపక్షంగా ఆమోదించి గిరిజనుల హక్కులను, చట్టాలను కాలరాస్తున్నారన్నారు. ప్రయివేటు కంపెనీలకు అడవులను ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అదానీ వంటి ప్రయివేటు సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిమిత్తం అన్ని అనుమతులూ ఇస్తూ అడవులను కట్టబెడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో పండించే

మిగతా 2లో

రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

2




బుద్ధదేవ్ భట్టాచార్యకు తీవ్ర అస్వస్థత

- వెంటిలేటర్‌పై చికిత్స
- నిలకడగా ఉందన్న వైద్యులు

లోపలి పేజీలో..

ఎఐతో ఉద్యోగాలు ఊడటం ఖాయం

- చాట్‌జిపిటి సృష్టికర్త శామ్ ఆల్ట్‌మన్



లోపలి పేజీలో..



మావోయిస్టుల కోసం గాలిస్తున్న పోలీసులు

సుక్మాలో ఎదురుకాల్పులు


ఆరుగురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మరణించి ఉండొచ్చు.. లేదా గాయాలపాలై ఉండొచ్చని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు మృతదేహాలు లభ్యం కాలేదన్నారు. చింతగుఫా, కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలోని చోటేకేద్వాల్ గ్రామ సమీపంలోని డివిజనల్ కమిటీ మెంబర్, కిష్టారం ఏరియా కమిటీ ఇన్‌ఛార్జి రాజుతోపాటు 30 నుంచి 35 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడ పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య గంట పాటు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నలుగురి నుంచి ఆరుగురు మావోయిస్టులు మృతిచెంది ఉండొచ్చు.. లేదా గాయపడి ఉండొచ్చు అని పోలీసులు పేర్కొన్నారు. అయితే వారిని మావోయిస్టులు అడవుల్లోకి లాక్కెళ్లి ఉండొచ్చని, ఆచూకీ కోసం కూంబింగ్ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

విజయవాడలో మరో కిడ్నీ రాకెట్

నకిలీ పత్రాలను గుర్తించిన తహశీల్దారు

ప్రజాశక్తి - భవానీపురం (విజయవాడ)



ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో శనివారం మరో కిడ్నీ రాకెట్ గుట్టురట్టు అయ్యింది. గుంటూరు జిల్లాకు చెందిన మస్తాన్‌బీ విజయవాడ భవానీపురం హెచ్‌బి కాలనీ ప్రాంతంలో నివాసముంటున్నారు. మస్తాన్‌బీ ఈ నెల 24న తన కిడ్నీని రామవరప్పాడులో నివాసముండే సత్యవతికి దానం చేసేందుకు అనుమతి ఇవ్వాలని విజయవాడ పశ్చిమ తహశీల్దారుకు దరఖాస్తు చేశారు. దీనిపై తహశీల్దారు విచారించగా అవి నకిలీ సర్టిఫికెట్లని గుర్తించారు. మస్తాన్‌బీ పేరును ఆధార్ కార్డులో తమ్మిశెట్టి రాజీగా మార్చుకున్నట్లు విచారణలో తేల్చారు. సుమారు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు కిడ్నీ మార్పిడికి బేరం కుదుర్చుకున్నట్లు, కొంత అడ్వాన్స్ కూడా తీసుకున్నట్లు తహశీల్దారు మీడియాకు వెల్లడించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కిడ్నీ రాకెట్‌ను వెలుగులోకి తెచ్చారు. అలాగే, రెండు రోజుల క్రితం విజయవాడ భవానీపురం బాలభాస్కర్ నగర్‌కు చెందిన గాడి చిన్న అనే మహిళ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నల్లమిల్లి దీపక్‌రెడ్డిని తన పెద్దనాన్న కుమారుడిగా చూపి కిడ్నీ దానానికి అనుమతి ఇవ్వాలని దరఖాస్తు చేశారు. విచారణలో అవి నకిలీ పత్రాలని తేలడంతో తహశీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు వ్యవహారాల్లోనూ కార్తీక్ అనే వ్యక్తి, మరో మహిళ బ్రోకర్లుగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ ఘటనలపై దర్యాప్తు చేస్తున్నామని భవానీపురం సిఐ సలాం తెలిపారు.



మదనపల్లె మార్కెట్‌లో కిలో టమాటా రూ.196

ప్రజాశక్తి-మదనపల్లె రూరల్

అన్నమయ్య జిల్లా మదనపల్లె మార్కెట్‌లో టమాటా ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో టమాటా పంట దిగుబడి తగ్గింది. మదనపల్లె మార్కెట్ పరిధిలో శనివారం రికార్డు స్థాయిలో కిలో నాణ్యమైన టమాటా రూ.196 పలికింది. అత్యల్పంగా రూ.140 ధర లభించింది. 'ఏ' గ్రేడ్ కిలో రూ.160 నుంచి రూ.196, 'బి' గ్రేడ్ రూ.120 నుంచి రూ.156 వరకు పలికిందని మార్కెట్ యార్డు కార్యదర్శి అభిలాష్ తెలిపారు. బుధవారం రూ.168 పలికిన ధర.. ప్రస్తుతం రూ.196 పలికింది. 253 టన్నులను మాత్రమే రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారు.

బాణసంచా గొడౌన్‌లో పేలుడు 9 మంది మృతి



చెన్నై : తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బాణసంచా గోడౌన్‌లో పేలుళ్లు సంభవించి, భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇప్పటి వరకూ తొమ్మిది మంది మరణించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మరో 16 మంది గాయపడ్డారు. వీరంతా కృష్ణగిరిలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భవన శిథిలాల కింద మరో ఐదుగురు చిక్కుకుని ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. శనివారం బాణసంచా గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో భయాందోళనలకు గురయ్యామని స్థానికులు తెలిపారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే ఘటనా ప్రాంతంలో క్షతగాత్రుల హాహాకారాలు, కుటుంబసభ్యుల ఆర్తనాదాలు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. కాగా, మృతుల్లో క్రాకర్స్ ఫ్యాక్టరీ యజమాని రవి, ఆయన భార్య జయశ్రీ, కుమార్తె, రుతిక, కుమారుడు రుతీష్ ఉన్నారు. వారితోపాటు ఫ్యాక్టరీ పక్కనే హోటల్ నడుపుతున్న రాజేశ్వరి, వెల్డింగ్ షాప్ నిర్వహిస్తున్న ఇబ్రహీమ్, ఇమ్రాన్, వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సరసు, జేమ్స్ ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. స్థానికంగా పనిచేసే మరో ఐదుగురి జాడ తెలియకపోవడంతో వారు శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. వారిని సురక్షితంగా బయటికి తీసేందుకు సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వర్సిటీ అధ్యాపక సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసు 65 ఏళ్లకు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది ఉద్యోగ విరమణ వయసును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం ఉన్న 62ను 65 ఏళ్లకు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు శనివారం జిఓ 39ను విడుదల చేశారు. యుజిసి స్కేల్ ప్రకారం వేతనం తీసుకుంటున్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 6వ కేంద్ర వేతన సంఘం ఉపాధ్యాయుల ఉద్యోగుల విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలని సిఫార్సు చేసింది.

యుజిసి స్కేళ్లను అమలు చేస్తున్న విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు అదే విధంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఈ నేపథ్యంలో అధ్యాపకుల ఉద్యోగుల విరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ఎపిఎస్‌సిహెచ్‌ఇఎల్ సెక్రటరీ అభిప్రాయపడ్డారు.

ఉద్యోగులకు రాయితీపై ప్లాట్లు : సిఆర్‌డిఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం రాయితీపై జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు కేటాయిస్తున్నట్లు సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశానుసారం తాడేపల్లి-మంగళగిరి నగర పాలక సంస్థ పరిధిలోని నవులూరులో నెలకొల్పబడిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్లు రిజర్వ్ చేశామని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబరు 38 ను విడుదల చేసిందని పేర్కొన్నారు. మధ్య తరగతి ఆదాయ సమూహాలు (ఎంఐజి) లే అవుట్లో 200, 240 చదరపు గజాల ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. చదరపు గజానికి ధర రూ.17, 499 గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం లే అవుట్లో మౌలిక సదుపాయాల పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఏకమొత్తం ఒకేసారి చెల్లించే వారికి 5 శాతం మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 40 శాతం అభివృద్ధి ధరపై రిజిస్ట్రేషన్ ఛార్జీలు కూడా మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసిఐసిఐ బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆగస్టు 1 నుంచి ఆగస్టు 31 వరకు దరఖాస్తులను సమర్పించవలెనని తెలిపారు.

ముగిసిన ఇసెట్ కౌన్సెలింగు

- 1 నుంచి తరగతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇసెట్-2023 అడ్మిషన్ల కౌన్సెలింగు శనివారంతో ముగిసింది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఈ నెల 30లోపు రిపోర్టు చేయాలని సెట్ కన్వీనరు సిహెచ్ నాగరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 237 కళాశాలల్లో 37,467 సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 1,912 మందిని, ప్రైవేటు కళాశాలల్లో 15,667 మందిని కేటాయించామని వివరించారు. మిగిలిన సీట్లను రెండో విడత కౌన్సెలింగులో భర్తీ చేస్తామని వెల్లడించారు. స్పోర్ట్స్, ఎన్‌సిసి కోటా సీట్లు భర్తీ చేయలేదని పేర్కొన్నారు.

1998 డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలి

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ నియామక పత్రాల కోసం నిరీక్షిస్తున్న 1998 డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఎస్‌సి పోస్టుల సాధన పోరాట సభ్యులు ఇ శ్రీనివాస్, పులివెందుల రమేష్‌తో కలిసి పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు.

ఎన్నికలకు ముందు తమ ఆందోళనకు మద్దతు ప్రకటించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మొత్తం 6,754 మందికి నియామక పత్రాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు 4,072 పోస్టులను మాత్రమే భర్తీ చేశారని తెలిపారు. మిగిలిన 2,682 పోస్టులను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగులు, ఒబిసిలతో భర్తీ చేయాలని కోరారు. దీనికి స్పందించిన విద్యాశాఖ కమిషనరు పరిశీలనలో సుమారు 2,300 పోస్టులున్నాయని, దీనిపై ముఖ్యమంత్రి త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశమున్నదని పేర్కొన్నారు.

ప్రత్యేక హోదాను వదిలేసుకున్న టిడిపి

- పోలవరం ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ అంతా కేంద్రం భరించాల్సిందే
- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ ప్రాజెక్టు పోలవరాన్ని కేంద్రం విభజన హామీల్లో భాగంగా నిర్మించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా 2016లో సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక హోదాను వదులుకుని ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. పోలవరంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదని, అనుకూలమైన కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పి వారి నుంచి డబ్బులు కాజేయాలనే ఆలోచించారని అన్నారు. కాఫర్ డ్యామ్ కట్టకుండా డయాఫ్రమ్ వాల్ కట్టడం వల్లే సమస్య వచ్చిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాతనే అప్పర్, లోయర్ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేశామని మంత్రి పేర్కొన్నారు. 2016లో ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు తీసుకున్న చంద్రబాబు, 2013-14 రేట్లకు అంగీకరించడమేంటని ప్రశ్నించారు. 2017-18 అంచనాల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.55,545 కోట్లకు పెరిగిందన్నారు. 2022కు పోలవరం పూర్తి చేస్తామని చెప్పామని, మాకేమి తెలుసు డయాఫ్రం వాల్ కొట్టుకుపోతుందని అని అన్నారు. మొదటి దశకు మాత్రమే కేంద్రం నిధులిచ్చిందన్నారు. ప్రాజెక్టు రెండు దశల్లో నిర్మితమవుతుందని, మొదటి దశలో 41.15 అడుగులు, రెండో దశలో ప్రాజెక్టు 45.72 అడుగులు అని మంత్రి వివరించారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ స్థానంలో కొత్తది కట్టాలని నిపుణులు పేర్కొంటున్నారని మంత్రి తెలిపారు.

చుట్టుముట్టిన గోదావరి వరద

- జలదిగ్బంధంలో ముంపు మండలాలు, లంక గ్రామాలు
- బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం



ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని రజకబజార్ నుంచి పునరావాస కాలనీకి వెళ్తున్న వరద బాధితులు

ప్రజాశక్తి- యంత్రాంగం

గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో ముంపు మండలాలు, పలు లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శనివారం వరద పోటు పెరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. తమను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలైన శబరి ఒడ్డు, సంత పాకలు, వాడబజార్, బిసి, ఎస్‌టి కాలనీ, మెడికల్ కాలనీ ప్రజలు నివాసాలు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్తున్నారు. విఆర్.పురం మండలంలో వరద ముంపునకు గురవుతున్న గిరిజనులను ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టించుకోలేదు. ఒడ్డుగూడెం గ్రామస్తులకు పునరావాస కేంద్రానికి వెళ్లేందుకు ఎటువంటి వాహనాన్నీ ఏర్పాటు చేయలేదు. దీంతో, గ్రామస్తులే సొంతంగా రూ.3 వేలు పెట్టుకుని వాహనాల్లో తమ సామాన్లతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. నిరుపేదలు సామాన్లను తలమీద, భుజాల మీద మోసుకుంటూనే రేఖపల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి కాలినడకన చేరుకున్నారు. మూడు కిలోమీటర్ల మేర లగేజీతో నడిచి వెళ్లడమంటే మాటలు కాదని, తమను అధికారులు పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు వాపోయారు. ఎటపాక మండలంలోని పలు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులను, నీట మునిగిన గ్రామాల్లోని ప్రజలను సిపిఎం నాయకులు పరామర్శించారు. కూనవరం మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయి. తాగునీరు కూడా అందుబాటులో లేదు. పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు సందర్శించారు. చింతూరు మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలైన శబరి ఒడ్డు, సంత పాకలు, వాడబజార్, బిసి, ఎస్‌టి కాలనీ, మెడికల్ కాలనీ ప్రజలు నివాసాలు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని అధికారులు సూచించారు.

ఏలూరు కుక్కునూరు మండలం చీరవల్లి-వింజరం మధ్య రోడ్డుపైకి వరద నీరు చేరింది. ఇప్పటికే పలు గ్రామాలకు చెందిన కుటుంబాలను పునరావాస కుక్కునూరులోని మసీదు బజార్, గణేష్‌నగర్, రజక బజార్ ప్రాంతాలకు చెందిన 120 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. కౌండిన్యముక్తి, బెస్తగూడెం ఎస్‌సి కాలనీకి చెందిన కుటుంబాలను కూడా పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టారు. ఇప్పటికే కుక్కునూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంకు వద్దకు వరద నీరు చేరింది. భద్రాచలం వద్ద మరో రెండు, మూడు అడుగుల వరద పెరిగితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుపోనున్నాయి. వరద ఉధృతి పెరుగుతుండడంతో పునరావాస చర్యలను పర్యవేక్షించేందుకు వేలేరుపాడు మండలానికి నూజివీడు సబ్ కలెక్టర్‌ను, కుక్కునూరు మండలానికి ఐటిడిఎ పిఒను పర్యవేక్షకులుగా నియమించారు.



పునరావాస కేంద్రాలకు సామాన్లు మోసుకుంటూ కాలినడకన వెళ్తున్న అల్లూరి జిల్లా విఆర్.పురం వాసులు

ముంపులో గోదావరి లంకలు

తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.కోనసీమ జిల్లాల్లో 25 మండలాలపై వరద ప్రభావం పడింది. 48 లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. కోనసీమ జిల్లా పి.గన్నవరంలో జి.పెదపూడిలంక, ఉడిముడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంకలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కొంతమందిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. కాజ్‌వేలన్నీ నీట మునిగాయి. సఖినేటిపల్లి మండలంలో అప్పనారామునిలంక, సఖినేటిపల్లిలంక, కొత్తలంక, టేకిశెట్టిపాలెం, మలికిపురం మండలం రామరాజులంక, బాడవ గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. టేకిశెట్టిపాలెం పూర్తిగా నీట మునగడంతో ప్రజలు ఏటిగట్టుపై తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నాలుగు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, నాలుగు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారు 30 గ్రామాలు నీట మునిగాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వరద బాధితుల కోసం 40 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. పి.గన్నవరంలో వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన శనివారం సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య సేవలపై ఆరా తీశారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లను పరిశీలించారు. ఏటిగట్ల పటిష్టతపై చర్యలు తీసుకోవాలని హెడ్ వర్క్స్, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, అవసరమైన చోట్ల ఆహార సదుపాయాలు, పడవలు ఏర్పాటు చేశామన్నారు.

ధవళేశ్వరం బ్యారేజీ దిగువన ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో వశిష్ట గోదావరి... లంక గ్రామాల ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఆచంట మండలంలోని పుచ్చల్లంక, అయోధ్యలంకల్లోని పల్లపు ప్రాంతాల్లోకి, భీమలాపురం కాలనీలోకి శనివారం సాయంత్రం వరద నీరు ప్రవేశించింది. యలమంచిలి మండలంలో కనకాయలంక, పెద్దలంక, బాడవ, యలమంచిలిలంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి తదితర గ్రామాలను వరద నీరు చుట్టుముడుతోంది. దీంతో, ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

గోదావరి వరద ప్రభావంతో మండలంలోని కాజ, నక్కల కాలువలు పోటెత్తి ప్రవహించడంతో వందలాది ఎకరాల్లో నారు మడులు నీట మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొడ్డిపట్ల చుట్టుపక్కల గ్రామాల వారికి దొడ్డిపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పెదలంక, కనకాయలంక గ్రామాలకు అంబేద్కర్ కోనసీమ జిల్లా తాటిపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా లంకల్లో ఇప్పటికే రహదారులు నీట మునిగాయి. పెదమల్లంలోని మాచేనమ్మ ఆలయ ప్రాంగణం, పర్యాటక కేంద్రం, కోడేరులోని అపర కర్మల భవనం చుట్టూ నీరు చేరింది. కూరగాయ పంటలు నీట మునిగాయి. తమలపాకు తోటలు, అరటి తోటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఏటిగట్టు దిగువన ఉన్న లంక గ్రామాల్లోని కొబ్బరి తోటల్లో అంతర పంటలు నీట మునిగాయి. పశువుల పాకల చుట్టూ నీరు చేరడంతో రైతులు పశువులను ఏటిగట్టుపైకి, ఇతర సురక్షిత ప్రాంతాలకు పశువులను తరలించారు. ఇటుక బట్టీలు వరద నీటిలో నానుతున్నాయి.

ఎపి బ్రాండ్ వాల్యూ పెంచేలా కొత్త పాలసీలు

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - మద్దిపాడు (ప్రకాశం జిల్లా)



ముఖాముఖిలో మాట్లాడుతున్న లోకేష్

ఎపి బ్రాండ్ వాల్యూ పెంచే విధంగా కొత్త పాలసీలు ప్రకటిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర శనివారం ప్రకాశం జిల్లా గుండ్లపల్లి క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైంది. క్యాంపు వద్ద వివిధ రంగాల ప్రొఫెషనల్స్‌తో లోకేష్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రకాశం జిల్లాని ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతామని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు వేయకపోవడం వల్ల కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు సర్టిఫికెట్లు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. యుపిపిఎస్‌సి తరహాలో ఎపిపిఎస్‌సిని బలోపేతం చేస్తామని, ఒక్కో జిల్లాలో ఒక్కో రంగాన్ని అభివృద్ధి చేస్తామని, కెజి టూ పిజి విద్యను ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రొఫెషనల్స్ అంతా రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ముందుకు రావాలని కోరారు. సంతనూతలపాడు నియోజవర్గం నుంచి బాపట్ల జిల్లా అద్దంకిలో యాత్ర ప్రవేశించింది.

'ముచ్చుమర్రి' నుంచి చంద్రబాబు పర్యటన

- 1 నుంచి అన్ని ప్రాజెక్టులూ సందర్శన
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టుల పర్యటన ఉమ్మడి కర్నూలు జిల్లా ముచ్చుమర్రి నుంచి ప్రారంభమవుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 1వ తేదీ నుంచి పదో తేదీ వరకు రాష్ట్రంలో ప్రాజెక్టులను సందర్శిస్తానని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఆగస్టు 1న ముచ్చుమర్రిని పరిశీలించి, అనంతరం కడప జిల్లా గండికోటకు చంద్రబాబు వెళ్తారని తెలిపారు. అక్కడి నుంచి అనంతపురం జిల్లాలోని ప్రాజెక్టుల్ని సందర్శిస్తారని వెల్లడించారు. ఆ తరువాత చిత్తూరు జిల్లా మదనపల్లెకు వెళ్లి హెచ్‌ఎన్‌ఎస్ పరిశీలించి, తరువాత తిరుపతిలోని బాలాజీ రిజర్వాయరును సందర్శిస్తారని చెప్పారు. అక్కడి నుంచి ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శిస్తారని అన్నారు. తరువాత పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అనంతరం ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టుల వద్దకు వెళ్తారని వివరించారు. ప్రాజెక్టుల వద్దే రైతులతో కలిసి బస చేస్తారని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి కీలకమైన సాగునీటి, వ్యవసాయ రంగాలను చేతగానితనం, అసమర్థతతో సిఎం జగన్ భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ధూళిపాళ్ల నరేంద్ర, మర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సిసి పుటేజీలోని వాళ్ల గురించి చార్జిషీట్‌లో ఎందుకు లేదు?

- అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో పోలీసులు దాఖలు చేసిన అదనపు చార్జిషీట్‌పై హైకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. సిసి టివి పుటేజీలో ఉన్న వారికి హత్యతో సంబంధం లేదని పోలీసులు ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించింది. ఆ పుటేజీ వివరాల గురించి అదనపు చార్జిషీట్‌లో ఎందుకు పేర్కొనలేదని కూడా ప్రశ్నించింది. గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు అదనపు చార్జిషీట్ లేదని ఆక్షేపించింది. ఆగస్టు 3న జరిగే విచారణనాడు పోలీసులు వివరణ ఇవ్వాలని జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. తన కుమారుడు హత్య కేసులో వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబుపై నమోదైన కేసును సిబిఐకి ఇవ్వాలంటూ డ్రైవర్ సుబ్రమణ్యం తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనరు తరపున న్యాయవాది వాదిస్తూ.. సిసి పుటేజీలో ఎమ్మెల్యే, ఆయన భార్య, ఇతర వ్యక్తులు ఉన్నారని, వీళ్లను అదనపు ఛార్జిషీట్‌లో పేర్కొనలేదని తెలిపారు. డ్రైవర్ సుబ్రమణ్యం మృతదేహాన్ని ఎమ్మెల్సీ కారులో ఎక్కించుకుని తీసుకెళ్లినట్లుగా సాక్షులు చెబుతున్నారని వివరించారు. ఎమ్మెల్సీ అనంతబాబు కారుడ్రైవర్ సుబ్రమణ్యం హత్యకు గురవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ కేసులో ఇప్పటికే అనంతబాబు అరెస్టయి, ఆ తరువాత విడుదలయ్యారు. వైసిపి ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

మతసామరస్యానికి ప్రతీక రొట్టెల పండుగ

- నెల్లూరులో ప్రారంభమైన ఐదురోజుల వేడుక

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మతసామరస్యానికి ప్రతీకైన రొట్టెల పండుగ నెల్లూరులో శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరిగే ఈ పండుగకు బారాషాహిద్ దర్గా, స్వర్ణాల చెరువు ముస్తాబైంది. మొహర్రం సందర్భంగా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతోపాటు విదేశాల నుంచి యాత్రికులు పెద్ద ఎత్తున తరలొచ్చారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్‌పి కె.తిరుమలేశ్వరరెడ్డి, జెసి కూర్మానాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ ఏర్పాట్లు పరిశీలించారు. ప్రతి ఏడాది మూడు రోజులపాటు జరిగే ఈ పండుగను యాత్రికుల రద్దీ మేరకు ఐదు రోజులకు పొడిగించారు. ఆగస్టు 2వ తేదీ వరకు రొట్టెల పండుగ జరగనుంది. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, ఉద్యోగం, విదేశీ ప్రయాణం, వివాహం, ఇలా అనేక రకాల రొట్టెలను ఒకరినొకరు పంచుకున్నారు. క్యూ లైన్లోని యాత్రికులకు ఇబ్బందులు లేకుండా అందరికీ త్వరితగతిన దర్శనం అయ్యేలా చూడాలని, వారికి తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. క్యూ లైన్లలో తోపులాటలకు ఆస్కారం లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, వికలాంగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. రాబోయే రోజుల్లో యాత్రికుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నందున, అందుకనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకున్నారు. స్వర్ణాల చెరువులో భక్తులు స్నానాలు చేస్తుండడంతో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. విద్యుత్, మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నా వాంగ్మూలాన్ని సిబిఐ తప్పుగా నమోదు చేసింది

- హైకోర్టులో అజేయ కల్లం పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తన వాంగ్మూలాన్ని సిబిఐ తప్పుగా నమోదు చేసిందని, ఛార్జిషీటు నుంచి దాన్ని తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రధాన సలహాదారు అజేయ కల్లం తెలంగాణ హైకోర్టులో శనివారం పిటిషన్ దాఖలు చేశారు. లోటస్‌పాండ్‌లో వైఎస్ జగన్‌తో తాము సమావేశంలో ఉండగా జగన్‌ను భారతి పిలిచారని సిబిఐకి తాను చెప్పలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. వివేకా హత్య కేసు ఛార్జిషీట్‌లో తాను చెప్పినట్లుగా పేర్కొన్న తన వాంగ్మూలాన్ని తొలగించాలని కోర్టును కోరారు. తన వాంగ్మూలానికి సంబంధించి మళ్లీ విచారణ జరిపేలా సిబిఐని ఆదేశించాలని ఆయన న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయస్థానం విచారణ చేసి నిర్ణయం తీసుకోనుంది. వివేకా హత్య కేసులో అజేయ కల్లంతో పాటు జగన్ పిఎ, ఒఎస్‌డి, వైసిపి నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, తదితరుల వాంగ్మూలాలను సిబిఐ నమోదు చేసింది. వాటన్నింటినీ ఫార్మేట్ రూపంలో జూన్ 30న సిబిఐ కోర్టుకు సిబిఐ సమర్పించింది.

టిడిపి నేత అనితకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వంగలపూడి అనితకు హైకోర్టులో వెసులుబాటు లభించింది. తమ పట్ల అనుచిత వార్తలు రాశారంటూ నందిగామ లోని సజ్జనరావు ఇంటి వద్ద ఆమె ధర్నా చేశారు. సజ్జనరావు భార్య భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలని కోరుతూ అనిత దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి విచారించారు. అనిత విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోరాదని, సిఆర్‌పిసిలోని 41(ఎ) నిబంధనల్ని పాటించాలని పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

రేషన్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రేషన్ మాఫియాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అర్హులందరికీ రేషన్ డిపోల ద్వారా అందజేయడం గురించి చెప్పకుండా.. మాఫియా గత ప్రభుత్వంలోనూ, ఇప్పుడూ ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పడం విస్మయం కలిగిస్తోందని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని అక్రమ రవాణా చేసి లాభాలు పిండుకుంటున్నారని విమర్శించారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నాయని, రైతులు ధాన్యం అమ్ముకున్నాక బియ్యం ధరలు పెంచుతున్నారని తెలిపారు. దీనికి తోడు కేంద్రం రేషన్ బియ్యంపై కోత విధించిందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబం నెలకు రూ.1500లకు పైగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని వివరించారు. బియ్యం అక్రమ రవాణా ఆపి సరసమైన ధరలకు వినియోగదారులకు అందించాలని కోరారు. గతంలో రేషన్ డిపోల ద్వారా సరఫరా చేసిన సరుకులు కూడా క్రమేణా తగ్గించేశారని పేర్కొన్నారు. కొన్నిచోట్ల కందిపప్పు ఇవ్వడం లేదని, సరఫరా చేసే క్వాంటిటీ తగ్గించేశారని తెలిపారు. సరఫరా చేసేవి కూడా నాణ్యత లేనివిగా ఉన్నాయని పేర్కొన్నారు. కాబట్టి అర్హులైన పేదలకు సక్రమంగా రేషన్ డిపోల ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె, చింతపండు మొదలైనవి అందేట్లు చూడాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌పై పురంధరేశ్వరి వ్యాఖ్యలు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి- అనకాపల్లి



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డి.పురంధరేశ్వరి విశాఖ పర్యటనలో భాగంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంపై మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం అమ్మకంపై ఏది లాభం అయితే అది చేస్తామని అనడాన్ని సిపిఎం ఒక ప్రకటనలో ఖండించింది. ఇప్పటికే ఒక పక్క స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం ప్రయివేటీకరిస్తామని పదేపదే కేంద్రంలోని బిజెపి మంత్రులు ప్రకటిస్తుంటే, వాటిని ఖండించి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడాల్సిన రాష్ట్ర బిజెపి నేతలు ఈ విధంగా మాట్లాడడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా ప్రయివేటీకరించి తీరుతామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెగేసి చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. అదానీతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుమ్మక్కై స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తోందని తెలిపారు. గంగవరం పోర్టులోకి స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన కొకింగ్ కోల్‌ను దిగుమతి అవ్వకుండా చేయడం, దిగుమతి అయిన బొగ్గును రకరకాల కారణాలు చూపి సకాలంలో ప్లాంట్‌కు చేరకుండా ఆటంకాలు కల్పించడం వంటి ఘటనలను లోకనాథం గుర్తు చేశారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగమని విమర్శించారు. విశాఖలోని విషయాలపై అవగాహన ఉండి ఈ విధంగా పురంధరేశ్వరి మాట్లాడం అన్యాయమని పేర్కొన్నారు. కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పరితపించారని, ఆయన స్ఫూర్తితో ఆంధ్రుల పక్షాన ఉండాల్సిన ఆమె ఇలా వ్యవహరించడం అంటే తెలుగు ప్రజలకు, ముఖ్యంగా విశాఖ వాసులకు ద్రోహం చేయడమే అవుతుందని తెలిపారు. 2019 ఎన్నికల సందర్భంగా విశాఖ రైల్వే గ్రౌండ్‌లో జరిగిన సభలో ప్రధాని, బిజెపి నేతలు మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారని, నేటికీ జోన్ వచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినప్పటికీ దానికి నిధులు ఇవ్వకుండా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా తీరని అన్యాయం చేస్తున్నారని తెలిపారు.



విజయవాడ 62వ డివిజన్‌లో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న నేతలు

మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపాలి

- కేంద్ర ప్రభుత్వం మౌనం వీడాలి
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

మణిపూర్‌లో జరిగిన అమానుష ఘటనలకు నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పలు జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలపై అమానుషకాండకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ మణిపూర్ ముఖ్యమంత్రి, కేంద్ర హోం శాఖ మంత్రి రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ 62వ డివిజన్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య స్కూల్ సెంటర్‌లో కెవిపిఎస్, డివైఎఫ్‌ఐ, దళిత సంఘాల నాయకులు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. మణిపూర్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ మంత్రుల రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల నిరసనలు జరిగాయి. కె.గంగవరం మండలంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కరపలో అంబేద్కర్ యువజన సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేశారు. కర్నూలు పాతబస్తీలో ర్యాలీ నిర్వహించారు. కర్నూలు ఉర్దూ ఘర్‌లో దళిత, గిరిజన, మైనారిటీ, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో చర్చా వేదిక చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యాన పెనుమంట్ర మండలం మార్టేరు సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యాంలో రాస్తారోకో చేశారు. శ్రీకాకుళం నగరంలోని పిఎస్‌ఎన్‌ఎం హైస్కూల్ జంక్షన్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అల్లర్లతో మణిపూర్ అట్టుడుకుతుంటే ప్రధాని మోడీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విఆర్‌ఓలపై ఒత్తిడి పెంచితే రాష్ట్ర్రవ్యాప్త ఆందోళనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విఆర్‌ఓలపై టార్గెట్లు పెట్టి ఒత్తిడిని పెంచుతున్న అధికారుల తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం.అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక వైపు భూముల రీసర్వే, మరో వైపు సిసిఆర్‌సి కార్డులు, ఇంకొక వైపు బిఎల్‌ఒ డ్యూటీలు, వీటికి తోడు వరద ప్రాంతాల్లో డ్యూటీలు, ఇలా విఆర్‌ఓలకు టార్గెట్లు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలో విఆర్‌ఓలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఉన్నతాధికారులు వత్తిడి పెంచడం దారుణమని అన్నారు.

ఆదివాసీలకు సంక్షేమ లబ్ధి ఏదీ?

మొదటి పేజీ తరువాయి

ఆర్గానిక్ కాఫీకి ప్రపంచ గుర్తింపు ఉన్నా దాన్ని పండించే రైతుకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదని చెప్పారు.కాఫీ ప్రోత్సాహక నిధులను ఐటిడిఎ నేటికీ రైతుల ఖాతాలో జమచేయలేదని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. వరదలు వచ్చి గ్రామాలు నీట మునుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. జీడి పిక్కల ధర దారుణంగా పడిపోయిందని, ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో గిరిజనుల మధ్య చిచ్చుపెట్టి, మత విద్వేషాలు రెచ్చగొట్టి ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. అక్కడ ఖనిజ సంపదను కొల్లగొట్టడానికే హింసాకాండకు ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు. 2002 గుజరాత్ మారణకాండ తరహాలో మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు, అకృత్యాలు జరుగుతుంటే కేంద్రంలోనూ, ఆ రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బిజెపి నోరెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె.రామారావు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

- కొనసాగిన ఐద్వా పోరుయాత్ర

ప్రజాశక్తి - యంత్రాంగం

దేశం, రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై హింస పెరిగిపోతుందని, మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభమైన 'మహిళా పోరుయాత్ర' కదిరి మీదుగా అన్నమయ్య జిల్లాకు, విశాఖలో ప్రారంభమైన జాతా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం మీదుగా పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం, పార్వతీపురంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు రక్షణ కరువవుతోందని, హింసను రెచ్చగొడుతోన్న బిజెపిని గద్దె దించాలని కోరారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు సిట్టింగ్ జడ్జి లేదా జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అనుసరిస్తోన్న మతోన్మాద, పాసిస్టు విధానాల వల్ల మహిళలపై దాడులు, హింస పెరిగాయని చెప్పారు. మణిపూర్‌లో మారణకాండకు మోడీదే ప్రధాన బాధ్యత అని అన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని, ఘటనకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోరు యాత్రలో భాగంగా ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన నాటిక, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం సాలూరు నుంచి విజయనగరంలోనికి పోరుయాత్ర ప్రవేశించనుంది. అన్నమయ్య జిల్లా రాయచోటి కెజిబివి మోడల్ స్కూల్, బస్టాండ్ సర్కిల్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పోరుయాత్రను ప్రారంభించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. 3200 మంది మహిళలు అదృశ్యమైతే ప్రభుత్వాలు నోరుమెదపలేదని విమర్శించారు.

మహిళల సమస్యలపై ఆగస్టు ఎనిమిదిన విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ.. దేశ ప్రతిష్ట పెంచిన మహిళా రెజ్లర్లు గోల్డ్ మెడల్ తెస్తే వారిపై లైంగిక వేధింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. రోజుకు వందల సంఖ్యలో మహిళలు అదృశ్యమవుతున్న కేసులు వెలుగు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పట్ల మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఆదివారం చిత్తూరు జిల్లా కుప్పంలోనికి పోరుయాత్ర ప్రవేశించనుంది. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు దిల్షాద్ రామంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

బిజెపి పాలిత రాష్ట్రాల్లో అప్పుల మాటేమిటి?

- పురందేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి బొత్స

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పుల్లో ప్రతి పైసా ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తున్నామని, అందుకు లెక్కలు కూడా ఉన్నాయని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అప్పుల మాటేమిటని ప్రశ్నించారు. పార్వతీపురం పట్టణంలో వైసిపి కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో బొత్స మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. పురందేశ్వరి ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లలో ప్రజల నెత్తిన రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని, కేంద్రం వివిధ పథకాల కింద రాష్ట్రానికి విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తోందని, పైగా... కేంద్రం రాష్ట్రానికి ఏమీ చేయలేదని దుష్ప్రచారం చేస్తోందని ఫిర్యాదు చేయడాన్ని మంత్రి ఖండించారు. జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉన్న వ్యక్తి బాధ్యతగా మాట్లాడాలన్నారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన సమస్యలైన విశాఖ ఉక్కు, విభజన హామీల అమలుపై కూడా మాట్లాడి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో రాష్ట్ర ప్రభుత్వం కృషిని గమనించాలన్నారు. సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయంలో గణనీయమైన పెరుగుదల వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను గుర్తు చేసుకోవాలని పురందేశ్వరికి సూచించారు. కొత్తగా పదవి వచ్చినందున బాధ్యత మరిచి విమర్శలు చేయడాన్ని ఆమె సంస్కారానికే వదిలేస్తున్నామని, రాజకీయ ప్రాధాన్యం కోసం ఆమె చేస్తున్న విమర్శలను తాము పట్టించుకోబోమని పేర్కొన్నారు.



నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న బమ్మిడి శ్రీరాములు, సురేఖ

జీడి మద్దతు కోసం లక్ష సంతకాల సేకరణ

- సత్యాగ్రహ దీక్ష విరమణ : జీడి రైతుసంఘం

ప్రజాశక్తి - పలాస

జీడికి మద్దతు ధర కల్పించాలని, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు తెలిపారు. సేకరించిన లక్ష సంతకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అందిస్తామన్నారు. సంతకాల సేకరణ ఉద్యమంలో జీడి రైతాంగం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జీడికి మద్దతు ధర కోసం కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద జీడిరైతు సంఘం ఆధ్వర్యాన చేపట్టిన 24 గంటల సత్యాగ్రహ దీక్ష శనివారం ముగిసింది. దీక్షలో కూర్చొన్న కె.మోహనరావు, కె.హేమారావు చౌదరి, పి.కుసుమ, కె.బాలాజీరావు, కె.సింహాచలం, ఎ.రామకృష్ణ, కె.తవిటయ్య, ఎస్.ఈశ్వరరావు, ఎస్.కుమార్, జె.గవరయ్య, కె.గురయ్యకు జీడి ఉద్యమ నాయకులు కె.సురేఖ, రైతుసంఘం సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీడి రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాను రూ.16 వేలకు కొనుగోలు చేయాలని, కేరళ తరహాలో జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, రైతులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దేశీయ జీడిపిక్కలు కొనుగోలు చేసిన తర్వాతనే విదేశీ పిక్కలు తేవాలన్నారు. దీక్షకు పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కె.ఎన్.వి.ప్రసాదరావు

ఎపిపిఆర్ గెజిటెడ్ అధికారుల సంఘం

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నారాయణరెడ్డి, ప్రసాదరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.నారాయణరెడ్డి, కె.ఎన్.వి. ప్రసాదరావు ఎన్నికయ్యారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని ఓ పంక్షన్ హాలులో శనివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా జి.వి.సూర్య నారాయణ, కన్వీనర్‌గా నాతి బుజ్జి, కోశాధికారులుగా పి.నరేష్ కుమార్, ఎ.సుధాకర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలోని జడ్‌పి సిఇఒలు, డిప్యూటీ సిఇఒలు, డివిజనల్ అభివృద్ధి అధికారులు, ఎంపిడిఒల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి అభినందించారు. 250 మంది ఎంపిడిఒలకు డివిజనల్, జిల్లా అధికారులుగా, 200 మందికి పంచాయితీరాజ్ ఉద్యోగులకు ఎంపిడిఒలుగా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలని, ఎంపిడిఒ పోస్టు పేరును బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (బిడిఒ)గా మార్పు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఏంజెల్ వన్ 'స్మార్ట్ ఇన్వెస్టింగ్ సూపర్ యాప్' ఆవిష్కరణ

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఏంజెల్ వన్ లిమిటెడ్ కొత్తగా స్మార్ట్ ఇన్వెస్టింగ్ సూపర్ యాప్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. ఇది ఇన్వెస్టర్ల సంపద సృష్టి ప్రయాణంలో డేటా, సాంకేతికత శక్తిని ప్రభావితం చేయడానికి మద్దతును ఇవ్వనుందని పేర్కొంది. వేగం, భద్రత, నమ్మదగిన అనుభవం లక్షణాలను కలిగి ఉందని తెలిపింది. సూపర్ యాప్ కస్టమర్ సెంట్రిసిటీని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందని తెలిపింది.

సంపాదకీయం


సిగ్గుపడాలి!

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా:' అంటారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని దీని అర్థం. ప్రకృతిని స్త్రీ రూపంగా చెబుతాయి వేదాలు. మాతృదేవోభవ అన్నారు పెద్దలు. స్త్రీని ఋగ్వేదం విశ్వశక్తి అని, ఉపనిషత్తులు సాధికారత కలిగిన శక్తి స్వరూపం అని అభివర్ణించాయి. పంచభూతాలలో భూమి, నీరు స్త్రీ స్వరూపంగా భావించి, భూ మాత, నదీ మతల్లి అని గౌరవాన్ని కట్టబెట్టారు. కానీ, వైదిక వాఙ్మయంలోనూ, పురాణేతిహాసాలలోనూ స్త్రీని కించపరిచే, అవమానపరచే అంశాలు అనేకం వున్నాయి. సీతను అపహరించిన రావణుడు, నిండు కొలువులో ద్రౌపదిని వస్త్రాపహరణం గావించిన దుర్యోధన దుశ్శాసనాదులు, సైరంధ్రి (ద్రౌపది)ని చెరపట్టిన కీచకుడు వంటి కిరాతకులు చాలామందే కనిపిస్తారు. అలాగే చరిత్రలోనూ రాజ్యాలతోపాటు రాణులనూ ఆక్రమించుకున్నవారున్నారు. అనంతర కాలంలో సతీసహగమనం, బాల్య వివాహాల వంటి దురాచారాలు, నిజాం రాజ్యంలో స్త్రీలను వివస్త్రలను గావించి, బతుకమ్మ ఆడించిన పైశాచికత్వం...భారతీయ యవనికపై మాయని మచ్చలు. 'ఈ దుర్యోధన దుశ్శాసన/ దుర్వినీత లోకంలో/ రక్తాశ్రులు చిందిస్తూ/ రాస్తున్నా శోకంతో/ మరో మహాభారతం ఆరవ వేదం/ మానభంగ పర్వంలో మణిపూర్ మహిళల/ మాతృహృదయ నిర్వేదం' అంటూ వేటూరి సజీవాక్షరాలకు, ఓ కవయిత్రి వేదనానభరిత ముక్తాయింపు. పురాణాలైనా, చరిత్రలోనైనా... మనుషుల పేర్లు, ఊరి పేర్లు మారినా... మారనిది మహిళల దుస్థితి. అప్పుడు, ఇప్పుడు బాధితురాలు మహిళే. కథలు, వ్యధలు, కన్నీళ్లు ఒక్కటే.


సున్నితమైన అలలు అలలుగా వుండే కొండలు, పచ్చదనం కప్పుకున్న లోయలు, ఆకాశాన్ని తనలో నింపినట్లుండే నీలి సరస్సులు, జలపాతాలు, దట్టమైన అడవులు, అందమైన మైదానాలతో ప్రకృతి పచ్చని పట్టువస్త్రం కప్పుకున్నట్లుండే ఆహ్లాదకరమైన రాష్ట్రం మణిపూర్. ఎప్పుడూ మృదువైన చల్లని గాలులు వీచే మణిపూర్‌లో ఇప్పుడు ఆక్రందనలు, శోకగీతాలు వినిపిస్తున్నాయి. అద్భుతమైన రంగురంగుల పూలతో అలరారే ఆ రాష్ట్ర తెల్లని జుకౌ లిల్లీ పువ్వు...తియ్యని మకరందానికి బదులుగా ఎర్రటి రక్తాన్ని స్రవిస్తున్నది. ఈ లిల్లీ పూలు స్రవిస్తున్న నెత్తుటికి కారకులెవరు? ధృతరాష్ట్రుని పాలనలో జాతుల మధ్య, మతాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి, అగ్గి రాజేసి, మహిళల నగ్న శరీరాలను ప్రదర్శనకు పెట్టిన ఆధునిక కీచక, దుర్యోధన దుశ్శాసనాదులు ఎవరు? గోసంరక్షకులమని, తమను తాము హిందుత్వ ప్రతినిధులమని చెప్పుకుంటున్నవారికి మణిపూర్ నగ్నత్వం బాధించలేదా? పైపెచ్చు 'అక్కడేం జరిగిందనీ...' అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం లేదా? గోవుల్లో దేవుడ్ని చూస్తున్నవారికి... మణిపూర్ ఆడపడుచుల ఆక్రందన కనబడకపోవడం శోచనీయం. మూడు నెలలు గడుస్తున్నా, వారి అభ్యర్థనలు, విజ్ఞాపనలు చెవికెక్కించుకోని ప్రధాని... దేశమంతా సిగ్గుపడాలి అంటున్నారు. నడిరోడ్డుపై స్త్రీలను వివస్త్రలను చేసి, అడ్డుకోబోయిన కుటుంబ సభ్యులను చంపి, అసహాయులను ఆధిపత్య హింసావాదులకు అప్పగించిన వారిని పల్లెత్తుమాట అనకపోగా...మౌనందాల్చిన వారు కదా ముందుగా సిగ్గుపడాలి.

ఇది ప్రమాదవశాత్తూ జరిగింది కాదని లోకజ్ఞానం వున్న ఎవరికైనా అర్థమౌతుంది. మణిపూర్ ఒక ప్రయోగశాల మాత్రమే. అక్కడి అడవులు, కొండల్లోని విలువైన ప్రకృతి వనరులను, సహజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పడమే ఈ హింసలోని కుట్ర కోణం. 'కన్నులుండి చూడలేని/ ధృతరాష్ట్రుల పాలనలో/ భర్తలుండి విధవ అయిన/ ద్రౌపది ఆక్రందనలో/ నవశక్తులు యువశక్తులు/ నిర్వీర్యం అవుతుంటే/ ఏమైపోతుంది సభ్య సమాజం' అన్న వేటూరి ఆవేదన ఈ సమాజానికి కనువిప్పు కావాలి. 'ఈ యాత్ర ఇలా కొనసాగుతునే వుంటుంది/ మీరు ఎత్తి చూపిన పాలిండ్లు/ కరుణ చూపని కటిక శిలలయ్యేవరకూ/ గగుర్పొడిచేలా గరళబీజాలు నాటిన/ మా గర్భసంచుల్లో/ గన్నేరుకాయలు కాసేవరకూ' అంటూ గర్జిస్తారు కవయిత్రి పాటిబండ్ల రజని. బేటీ బచావో గురించి, సనాతన ధర్మం గురించి చెప్పే మీరు ఏ ముఖం పెట్టుకుని అంటారు...భారత్ మాతాకీ జై అని. దేశాన్ని ప్రపంచం ముందు నగ్నంగా నిలబెట్టినందుకు...వారు సిగ్గుపడాలి.

మహనీయుల మాట




తెలివైన వారెప్పుడూ కాలాన్ని క్షణం కూడా వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటారు.
- జాన్ రస్కిన్, బ్రిటీష్ రచయిత.



అవిశ్వాసంతో మోడీ సర్కారుకు రాజకీయ సవాలు

ప్రస్తుతం



మణిపూర్ పుత్రికలపై జరిగిన అమానుషానికి దేశమంతా సిగ్గుపడాలని చెప్పిన మోడీ అదే మాట సభలో చెప్పడానికి సిద్ధం కాకపోవడం ఇందుకు కారణమైంది. చర్చకు మొహం చాటేస్తున్న మోడీని దారికి తేవడానికి, మణిపూర్‌తో సహా దేశ పరిస్థితిని సాకల్యంగా చర్చించడానికి ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడంతో ఈ ఎత్తుగడకు బ్రేక్ పడింది. నోటీసును ఆమోదించి కూడా చర్చకు సమయం నిర్ణయించకుండా కాలయాపన చేయడంలో బిజెపి సర్కారు డొల్లతనం వెల్లడైపోయింది. తాము చర్చకు సిద్ధంగా వున్నా ప్రతిపక్షాలు ముందుకు రాలేదని హోంమంత్రి అమిత్ షా ఆరోపించడం ఇందులో భాగమే...

మణిపూర్ ఘోర దురంతాలపై ప్రకటన చేయడానికి, చర్చ జరపడానికి నిరాకరిస్తున్న ప్రధాని మోడీ వైఖరితో పార్లమెంటు విలువైన కాలం వృథా అయిపోతున్నది. మణిపూర్ పుత్రికలపై జరిగిన అమానుషానికి దేశమంతా సిగ్గుపడాలని చెప్పిన మోడీ అదే మాట సభలో చెప్పడానికి సిద్ధం కాకపోవడం ఇందుకు కారణమైంది. చర్చకు మొహం చాటేస్తున్న మోడీని దారికి తేవడానికి, మణిపూర్‌తో సహా దేశ పరిస్థితిని సాకల్యంగా చర్చించడానికి ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడంతో ఈ ఎత్తుగడకు బ్రేక్ పడింది. నోటీసును ఆమోదించి కూడా చర్చకు సమయం నిర్ణయించకుండా కాలయాపన చేయడంలో బిజెపి సర్కారు డొల్లతనం వెల్లడైపోయింది. తాము చర్చకు సిద్ధంగా వున్నా ప్రతిపక్షాలు ముందుకు రాలేదని హోంమంత్రి అమిత్ షా ఆరోపించడం ఇందులో భాగమే. వాస్తవానికి ఈ వ్యవహారంలో రెండవ ప్రధాన పాత్రధారి అమిత్ షానే, హోంమంత్రిగానూ, ఈశాన్య రాష్ట్రాలలో బిజెపి బాధ్యుడుగానూ ఆయనకు కీలకమైన బాధ్యత వుంది. మహిళలపై సామూహిక అత్యాచారం మే 3-4 తేదీల్లో జరిగితే మరో పదిహేను రోజుల తర్వాత పర్యటనకు వెళ్లింది ఆయనే, ఇప్పుడు తెలియవస్తున్న సమాచారం ప్రకారం అప్పటికే ఆ దారుణ ఘటనపై పోలీసు స్టేషన్లలో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. బాధితులే వచ్చి ఫిర్యాదు చేశారు. ఒక కల్లోలిత రాష్ట్రంలో ఎఫ్‌ఐఆర్ నమోదైన తర్వాత కూడా పరిస్థితి తెలుసుకోలేకపోవడం హోం మంత్రి అసమర్థతకు అద్దం పడుతుంది. నిఘా సంస్థలకు ఆధ్వర్యం వహించే మంత్రికి ఈశాన్య రాష్ట్రంలో ఎగుస్తున్న మంటలు కనిపించలేదంటే ఎలా విశ్వసించడం? అక్కడకు పర్యటనకు వెళ్లినప్పుడైనా ప్రభుత్వం, పోలీసు శాఖ, నిఘా వర్గాలు చెప్పలేదా? వందల సంఖ్యలో జరిగితే ఇదొక్కటి పట్టుకుంటారేమని నిస్సిగ్గుగా వాదించిన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చెప్పలేదా? ఈశాన్య చాణక్యుడుగా చెప్పుకునే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ నివేదించలేదా? ఇంతకన్నా ఆత్మవంచన మరేముంటుంది? అలా అయితే ఇందుకుగాను హోంశాఖ అధికారులు అమాత్యులపై చర్య తీసుకోవద్దా?



తెలకపల్లి రవి

వీడియో తీసిన వారి అరెస్టు

ఈ ఘటనతో పాటు మణిపూర్‌లో జరిగిన మరెన్నో అఘాయిత్యాల బాధాకర వివరాలు ఇప్పుడు బయటికొస్తున్నాయి. వాటిపై ఏ చర్యలూ తీసుకున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు, దేశవ్యాపితంగా ఇంతగా ఆగ్రహావేశాలు రగిలించిన ఈ కేసులోనే కేంద్రం చేసిందేమిటి? ఆ రోజు వీడియో తీసిన వ్యక్తిని అరెస్టు చేశారట! జరిగింది షూట్ చేసి దేశమంతా అందుబాటులోకి తెచ్చినందుకు కేసు నమోదు చేశారట. ఇదేగాక ఇలాంటి ఘటనలు ఎలా ఎన్ని జరిగాయో దర్యాప్తు చేసే బాధ్యత సిబిఐకి అప్పగించారట! ఏదో సామెత చెప్పినట్టు సిబిఐ, ఐ.బి, రా వంటి సంస్థలు సక్రమంగా పనిచేస్తే ఈ పరిస్థితి ఎందుకు వచ్చేది? పైగా పంజరంలో చిలకగా పేరుమోసిన సిబిఐ ఇలాంటి వాటిని సమర్థంగా వెలికితీసిన ఉదాహరణ ఒకటైనా వుందా? అన్ని సందర్భాల్లోనూ మారణకాండ జరిగిన తర్వాతనే కదా సిబిఐ రంగంలోకి వచ్చేది? ఈ విషయమైనా ప్రభుత్వం పార్లమెంటుకు చెప్పలేదు. సుప్రీం కోర్టులో అఫిడవిట్ ద్వారా తెలియజేసింది. మీరు చర్య తీసుకుంటారా లేక మేమే రంగంలోకి దిగాలా అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ అక్షింతలు వేశాక అనివార్యంగా ఇచ్చిన జవాబిది. సుప్రీంకోర్టు ఇలా అడగడం కూడా ఇష్టం లేని బద్రి శేషాద్రి అనే తమిళ పాత్రికేయుడు యూట్యూబ్ ఇంటర్వ్యూలో సిజెఐ పైనే అవాకులకు దిగారు. ప్రధాన న్యాయమూర్తికి ఒక తుపాకి ఇచ్చి పంపిస్తే ఘర్షణలను నివారిస్తారేమో చూడాలని అపహాస్యం చేశారు. అది పర్వతమయమైన సంక్లిష్ట ప్రాంతం. అక్కడ హత్యలు జరుగుతాయి. హింసాకాండ మనం ఆపలేం అని తేల్చిపారేశాడు. దీని మీద కవిఅరసు అనే అడ్వకేట్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అరెస్టు చేశారు. దేశంలో ఎందరో రచయితలు, పాత్రికేయులను నిరంకుశంగా అరెస్టు చేసిన బిజెపికి ఇది మాత్రం మహాపరాధమైపోయింది. తమిళనాడు బిజెపి అధ్యక్షుడు అన్నామలై వెంటనే తీవ్రంగా ఖండించేశారు. అంటే అక్కడ ఆదివాసులపై దాడులను, ఈశాన్యంలో అంతర్యుద్ధాన్ని ఆపకపోగా దేశ ప్రధాన న్యాయమూర్తినే అపహాస్యం చేసిన వ్యక్తిని విచారించకూడదన్నమాట. ప్లాటినం తరహా ఖనిజాలతో పాటు అపార సంపదలకు నిలయమైన ఆ ప్రాంతాన్ని బడా కంపెనీల పాలు చేయడానికే కావాలని కల్లోలం సృష్టించినట్టు కూడా మీడియా సంస్థలను పేర్కొంటున్నాయి.

వంకర వాదనలతో పక్కదారి

మణిపూర్‌పై మాట్లాడేబదులు అలవాటైన అధ్వాన్న వ్యూహాలన్నిటినీ అమ్ముల పొదిలోంచి తీసింది బిజెపి. బెంగాల్, రాజస్థాన్‌లలో మహిళలపై ఇలాంటి ఘటనలే జరిగాయని పోటీ పెడుతోంది. బెంగాల్‌లో జరిగిన ఘటనలను మొన్న ఇదే పేజీలో చర్చ చేశాం. ఆ కుట్రలో బిజెపికి కూడా వాటా వుంది. అదలా వుంచితే అమానుషాలను నివారించడానికి బదులు ఒకదానికి ఒకటి పోటీ పెట్టడం ఏం రాజనీతి? ఇంకోటి మయన్మార్‌ను చైనాను ఇందుకు కారణంగా నిందించడం. మయన్మార్ సైనిక పాలకుల అణచివేత కారణంగా శరణార్థులు వచ్చి తలదాచుకుంటున్న మాట నిజమే. కాని మైతేయి, కుకీ తెగల మధ్య బిజెపి సృష్టించిన అంతర్యుద్ధానికి వారెలా కారణమవుతారు? ఇక భారత మాజీ సైన్యాధికారి నవరత్నే ఏకంగా చైనానే వీటన్నిటికీ కారణమని తేల్చిపారేశారు! ఒకవైపున విదేశాంగ మంత్రి జైశంకర్ అంతకు ముందు మోడీ చైనా నేతలతో చర్చలు జరిపి సంబంధాల మెరుగుదల గురించి మాట్లాడుతూ మాజీ సైన్యాధిపతి ఇలా అనడం దానికి విస్తారమైన ప్రచారం కల్పించంలో విదేశాంగ నీతీ కనిపించదు. బిజెపికి కేంద్రానికి కావలసింది ఈ గండం నుంచి గట్టెక్కడమే. అందుకు మార్గం ఇతరులపై దాడి చేయడం, చర్చను దారి మళ్లించడం. వాస్తవానికి మణిపూర్ అంటున్నా ఈ జ్వాలలు ఈశాన్యమంతటినీ కబళించే ప్రమాదం వుందని గతవారం ఈ శీర్షికలో చెప్పుకున్నాం. మిజోరాం ముఖ్యమంత్రి ఇప్పటికే పలురకాల నిరసనలలో, ఆందోళనలలో పాల్గొన్నారు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఇది తమ భద్రతకు కూడా ముప్పని హెచ్చరించారు. మిజోరాంలో కుకి, జో ఉపజాతి ప్రజలు అధికంగా వుంటారు. అక్కడ శరణార్థి శిబిరాలు నిర్వహించడం కూడా బిజెపి సహించలేకపోతున్నది. వీటన్నిటినీ అస్సాంకు తరలించాలని కేంద్రం ప్రతిపాదించడం అందుకే. అయితే అస్సాం ముఖ్యమంత్రి హిమంత ఈశాన్య కల్లోలం సూత్రధారులలో ఒకరు. సరిహద్దు రాష్ట్రాలన్నిటితో దానికి తగాదాలున్నాయని గుర్తుచేసుకుంటే ఇదెంత ప్రమాదకరమైన సూచనో స్పష్టమవుతుంది. హిందూ ముస్లిం తగాదాలను ఇతర జాతి కలహాలను రాజేయడంలో అస్సాంకు దారుణమైన చరిత్ర వుంది. పాలనా పరంగానూ ప్రజాస్వామిక చర్చలతోనూ సమస్యను పరిష్కరించే బదులు రాజకీయ కోణంలో ఉపయోగించుకోవడమే బిజెపి పరమ సూత్రంగా వుందని ఈ ఉదాహరణలన్నీ విశదం చేస్తాయి. అత్యాచారానికి గురైన మహిళలను సాటి మహిళలే పట్టించారని మరో విపరీత వాదన కూడా పాలక పార్టీ ప్రచారంలో పెట్టింది. విద్వేషాలు రగిలించిన తర్వాత ఎవరు ఏం చేస్తారో ఎవరు చెప్పగలరు? అందులోనూ మైతేయి ప్రజలను కుకీల పైకి ఉసిగొల్పిన తర్వాత.. మైదాన ప్రాంత ప్రజలను కూడా గిరిజనులుగా గుర్తించాలని ఇంఫాల్ హైకోర్టు బాధ్యతా రహితంగా ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు కూడా తప్పు పట్టింది, అయినా రాష్ట్ర ప్రభుత్వం బిజెపి నాయకత్వం ఆమోదించాయి. ఆ రాష్ట్రంలోనేగాక మొత్తం ఈశాన్యంలో రాజకీయ మద్దతు పెంచుకోవడానికి ఆడిన నాటకమే ఇంతటి విపత్కర పరిస్థితికి కారణమైంది. ఇప్పుడు మరెవరిపైనో నిందలా?

ప్రతిపక్షాల ప్రతిఘటన, వైసిపి టిడిపి వంత

ఒకవైపు ఇంత దారుణమైన నిందలేస్తూనే అమిత్ షా ఉభయ సభల్లో ప్రతిపక్ష నాయకులైన మల్లికార్జున ఖర్గే, అధీర్ రంజన్ చౌదరిలకు లేఖలు రాస్తారు. చర్చకు సహకరించాల్సిందిగా లేఖలు రాయడం కన్నా కపటం ఏముంటుంది? ఖర్గే అన్నట్టు ఒకవైపున మోడీ ప్రతిపక్షాలను దేశ వ్యతిరేక శక్తులతోనూ టెర్రరిస్టులతోనూ పోల్చి మాట్లాడుతూ మరోవైపున ఇలాంటి మెత్తటి లేఖలు ప్రయోగిస్తే ఫలితం ఏముంటుంది? ప్రతిపక్షాలు ఇండియా అని తమ కూటమికి పేరు పెట్టుకున్నారు గాని ఇండియన్ ముజహదీన్‌లోనూ ఈస్టిండియా కంపెనీలోనూ కూడా ఇండియా వుందని అవహేళన చేసిన మోడీ మాటలు దేన్ని సూచిస్తాయి? నిజానికి చర్చ సంగతి అటుంచి పార్లమెంటులో మణిపూర్‌పై వేసిన ప్రశ్నలకు కూడా ఈ అంశం కోర్టు పరిధిలో వుందంటూ సమాధానాలు ఇవ్వకుండా తిరస్కరిస్తున్నారు. నేను మూడోసారి అధికారంలోకి వచ్చాక దేశాన్ని మూడో ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని ప్రధాని ప్రగల్భాలు పలుకుతున్నారు. సహజంగా భారత దేశం పెద్ద దేశంగా ఇప్పుడు అయిదో స్థానంలో వుంది. అయితే మనకన్నా చైనా ఆరు రెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థగా పెంపొందుతున్నది. అయిదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ కావడమే పెద్ద గొప్ప విషయంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పుకున్న రోజులు ఎవరూ మర్చిపోరు. ఇప్పటికీ కూడా మన ఆర్థిక వ్యవస్థ 3.2 ట్రిలియన్లు దాటలేదు. చైనా 17.3 ట్రిలియన్ల దగ్గర దూసుకుపోతున్నది. జిడిపి గొప్పలు అలా వుంచి తలసరి ఆదాయంలో మన వెనుకబాటును, అంతులేని అసమానతలను విమర్శకులు మోడీకి సరిగానే గుర్తు చేశారు.

పరిస్థితికి సంబంధించిన పూర్తి నిజాలు దేశానికి తెలియడం కోసం ప్రతిపక్ష పార్టీలకు చెందిన 21 మంది ఎంపీలు మణిపూర్‌లో స్వయంగా పర్యటన చేస్తున్నారు. దీనివల్ల అక్కడ పర్యటించకుండా దాటేసిన మోడీ తీరుకు అది సమాధానమూ అవుతుంది. ఇంత కీలకమైన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పాలక పార్టీలైన వైసిపి, తెలుగుదేశం బిజెపికి అనుకూలంగా వ్యవహరించడం అవకాశవాదానికి పరాకాష్ట. ఎ.పి కీ అనేక విధాల అన్యాయం చేసిన మోడీ సర్కారును నిలదీయడానికి ఈ అవకాశం ఉపయోగించుకునే బదులు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించాలని వైసిపి నిర్ణయించింది. అమిత్‌షా చెప్పిందే సరైందని ప్రతిపక్షం వైఖరి తప్పని ఆ పార్టీ నేత విజయ సాయిరెడ్డి ప్రవచించారు. ఢిల్లీ ఆర్డినెన్సు బిల్లుపైనా మద్దతు ప్రకటించారు. టిడిపి ఎం.పి గల్లా జయదేవ్ మొదట్లో బలపరుస్తామని సూచించారు. అయితే ఎన్‌డిఎలో చేరుతామన్నా చేర్చుకోలేదని, అధికార పూర్వకంగా తమ మద్దతు కోరలేదని ఆపార్టీ కొంత సమయం తీసుకుంటున్నట్టు కనిపిస్తుంది. ఇంతవరకూ మణిపూర్ విషయంలో కేంద్రాన్ని బిజెపిని పల్లెత్తు మాట అన్నది లేదు. కొంత జాప్యం వ్యూహం అనుసరిస్తున్నా టిడిపి ప్రతిపక్షాలతో ఓటు చేస్తుందన్న అంచనా ఎవరికీ లేదు. కాంగ్రెస్‌తో కలసి వేదిక పంచుకోబోమన్న బిఆర్ఎస్ మాత్రం వ్యతిరేకంగా వుంటాననే చెబుతున్నది. ఏది ఏమైనా ప్రభుత్వం పడిపోయే ముప్పు లేకున్నా ఈ అవిశ్వాస పర్వం అయిదు రాష్ట్రాల ఎన్నికల తరుణంలో బిజెపికి పెద్ద రాజకీయ సవాలుగానే మారింది.


ప్రపంచ ఆకలి-ఉక్రెయిన్ యుద్ధం!

అంతర్జాతీయం

"నల్ల సముద్రం ఒప్పందాలు ఇంక ఎంత మాత్రం అమలులో వుండవు" అని గత నెల 17న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతినిధి ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన నేపథ్యంలో ఆహార ధాన్యాల సరఫరాపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నివారించేందుకు గతేడాది జులైలో కుదిరిన బ్లాక్ సీ గ్రెయిన్ ఇనీషియేటివ్‌ను నిలుపుచేస్తూ రష్యా నిష్కర్షగా చేసిన ప్రకటన ఇది. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి, టర్కీ అధ్యక్షుడు సమక్షంలో ఇస్తాంబుల్ రష్యా, ఉక్రెయిన్ అధికారులు గతేడాది జులై 22న ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందాన్ని 'ఆశా కిరణం'గా గుటెరస్ అభివర్ణించారు. ఇందుకు రెండు కారణాలున్నాయి. మొదటిది, ఇప్పటికే యుద్ధం జరుపుతున్న రెండు పక్షాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం విశేషమైనది. రెండవది, గోధుమలు, బార్లీ, జొన్న, పొద్దు తిరుగుడు విత్తనాలు, పొద్దు తిరుగుడు నూనెలను ప్రధానంగా ఉత్పత్తి చేసేది రష్యా, ఉక్రెయిన్‌లే. పైగా నైట్రోజెన్, ఫాస్పరస్ ఎరువుల ఉత్పత్తి కూడా ఈ రెండు దేశాల నుండి ఎక్కువగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఈ రెండు దేశాలు యుద్ధానికి దిగడం వల్ల సరఫరాలకు ఆటంకం కలిగితే ప్రపంచ ఆహార మార్కెట్లపై, ప్రపంచ ప్రజల ఆకలిపై తీవ్ర ప్రభావం వుంటుందని భావించారు.

ఆకలికి దారి తీస్తున్న ద్రవ్య పెట్టుబడి

ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రజలు ఆకలితో బాధపడుతున్న నేపథ్యంలో రష్యా 'ఆహారాన్ని ఆయుధంగా మార్చడం' పట్ల తమ దేశం ఆందోళన చెందుతోందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పేర్కొన్నారు. నిజానికి, ప్రపంచ దేశాల్లో ప్రతి పది మందిలో ఒకరు ఆకలితో బాధపడుతున్నారని, 310 కోట్ల మంది ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం తినలేకపోతున్నారని 'ప్రపంచ దేశాల్లో ఆహార భద్రత, పోషకాహారం పరిస్థితి'పై ఐక్యరాజ్య సమితి నివేదిక (జులై 12, 2023) పేర్కొంది. అయితే ఈ నివేదికలోనే ఒక ఆసక్తికరమైన అంశం వుంది: ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం వల్లనే 2.3 కోట్ల మంది ప్రజలు ఆకలి బాధలను ఎదుర్కొంటున్నారు. అయితే ఆహార మార్కెట్ల వాణిజ్యీకరణ ప్రభావం, కోవిడ్ మహమ్మారి వంటి క్షుద్బాధకు సంబంధించిన ఇతర సూచీలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువేనని చెప్పాలి.



విజయప్రసాద్

వాస్తవానికి ఆహార కొరతలు వున్నాయని, అయితే "ప్రస్తుత ఆహార సంక్షోభం, సరఫరా సంక్షోభం కన్నా ధరల సంక్షోభమే తీవ్రమైనదని ఆహార మార్కెట్లలో స్పెక్యులేటివ్ కార్యకలాపాలపై అధ్యయనం చేసిన డాక్టర్ సోఫీ వాన్ హులెన్ గతేడాది చివరిలోనే పేర్కొన్నారు. 'బ్లాక్ సీ గ్రెయిన్ ఇనీషియేటివ్' అమలు ఇలా ముగిసిపోవడం నిజంగా విచారించదగ్గదే. కానీ ప్రపంచ దేశాల్లో ఆకలికి ఇదే ప్రధాన కారణం కాదు. ప్రధాన కారణం ఆహార మార్కెట్లలో స్పెక్యులేటివ్ కార్యకలాపాలే. దీనిని యూరోపియన్ ఆర్థిక, సామాజిక కమిటీ కూడా అంగీకరించింది.

రష్యా ఈ ఒప్పందాన్ని ఎందుకు నిలిపివేసింది?

ఈ ఒప్పందాన్ని పర్యవేక్షించేందుకు ఐక్యరాజ్య సమితి ఇస్తాంబుల్‌లో సంయుక్త సమన్వయ కేంద్రాన్ని (జెసిసి)ని ఏర్పాటు చేసింది. ఇందులో రష్యా, టర్కీ, ఉక్రెయిన్, ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు సభ్యులుగా వున్నారు. క్రిమియా లోని సెవాస్తోపోల్‌లో రష్యాకి చెందిన నల్ల సముద్ర దళంపై ఉక్రెయిన్ దాడి చేయడం (ఈ దాడిలో ఆహార ధాన్యాలు తీసుకెళుతున్న నౌకలు వున్నాయి) వంటి పలు సందర్భాల్లో, షిప్‌మెంట్లపై రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య తలెత్తే ఉద్రిక్తతలను జెసిసి పరిష్కరించాల్సి వచ్చింది. రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షలు కట్టుదిట్టం చేయడంపై ఉద్రిక్తతలు అలాగే కొనసాగుతూ వున్నాయి. ఈ ఆంక్షల కారణంగా రష్యా తన సొంత వ్యవసాయ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌కు ఎగుమతి చేయలేకపోతోంది. ఐక్యరాజ్య సమితితో చర్చల సందర్భంగా రష్యా తన సొంత వ్యవసాయ వ్యవస్థకు సంబంధించి మూడు అవసరాలను పేర్కొంది. మొదటిది, రష్యా వ్యవసాయానికి ప్రధానంగా ఉపయోగపడే ప్రధాన రుణ, వాణిజ్య బ్యాంక్ అయిన రష్యన్ అగ్రికల్చర్ బ్యాంక్‌ను స్విఫ్ట్ వ్యవస్థకు తిరిగి అనుసంధానించాల్సిందిగా రష్యన్ ప్రభుత్వం కోరింది. గతేడాది జూన్‌లో యూరోపియన్ యూనియన్ ఆరవ ఆంక్షల ప్యాకేజీ ద్వారా స్విఫ్ట్ వ్యవస్థతో బ్యాంక్ బంధం తెగిపోయింది. రష్యన్ వ్యవసాయ బ్యాంక్‌కు సాధారణ లైసెన్స్‌ను యూరోపియన్ యూనియన్ జారీ చేసే అవకాశం వుందని, అలాగే 'బ్లాక్ సీ గ్రెయిన్ ఇనీషియేటివ్'లో భాగంగా ఎగుమతిదారులు చెల్లించినంత కాలమూ అమెరికా డాలర్లలో లావాదేవీలు నిర్వహించేందుకు జెపి మోర్గాన్‌ను ఉపయోగించుకునే అవకాశం బ్యాంక్‌కు వుందని టర్కిష్ బ్యాంకర్ తెలిపారు.

రెండవది, గ్రెయిన్ ఇనీషియేటివ్ గురించి మొదటగా చర్చలు జరిగినపుడు, రష్యా నుండి అమ్మోనియా ఎరువుల ఎగుమతి ఒడెసా ఓడరేవు ద్వారానే జరగాలని, అలాగే లాత్వియా, నెదర్లాండ్స్‌లోని సరఫరాల నుండే జరగాలని మాస్కో కోరింది. ప్రపంచంలోని అతి పొడవైన అమ్మోనియా పైప్‌లైన్ టోగ్లియాట్టి-ఒడెసా పైప్ లైన్‌ను తిరిగి తెరవాలన్నదే చర్చల్లో ప్రధాన అంశంగా వుంది. ప్రపంచ మార్కెట్‌లో రష్యన్ అమ్మోనియా అమ్మకాలకు వీలు కల్పించే ఒప్పందంపై గతేడాది జులైలో ఐక్యరాజ్య సమితి, రష్యాలు సంతకాలు చేశాయి. "ఇప్పటికే పశ్చిమ ఆఫ్రికాలో, ఇతర చోట్ల వ్యవసాయాన్ని ప్రభావితం చేసిన తీవ్రమైన ఎరువుల మార్కెట్ సంక్షోభాన్ని సడలించేందుకు సాధ్యమైనవన్నీ మేం చేస్తున్నాం." అంటూ ప్రకటించడానికి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ భద్రతా మండలికి వెళ్లారు. "ఎరువుల మార్కెట్ సుస్థిరంగా లేనట్లైతే, వచ్చే ఏడాది ఆహార సరఫరా సంక్షోభం తలెత్తే అవకాశం వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రపంచ దేశాలకు ఆహారం లేకుండా పోవచ్చు" అన్నారాయన. ఈ ఏడాది జూన్ 8న, ఖర్కీవ్‌లోని టోగ్లియాట్టి-ఒడెసా పైప్‌లైన్‌లో కొంత భాగాన్ని ఉక్రెయిన్ బలగాలు పేల్చివేశాయి. దీంతో ఈ వివాదంపై ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. నల్ల సముద్రం ఓడరేవులు కాకుండా, రష్యాకు తన అమ్మోనియా ఆధారిత ఎరువులు ఎగుమతి చేయడానికి సురక్షితమైన మార్గం ఇంకోటి లేదు.

మూడవది, యంత్రాలు, విడి భాగాలు దిగుమతి చేసుకునే సామర్థ్యం లేకపోవడం, ఇతర అనేక విదేశీ ఓడరేవుల్లో ప్రవేశించలేకపోవడంతో రష్యా వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. వ్యవసాయ రంగానికి సంబంధించి పశ్చిమ దేశాల ఆంక్షల్లో కొన్ని సడలింపులు వున్నప్పటికీ, సంస్థలపై, వ్యక్తులపై ఆంక్షలు రష్యన్ వ్యవసాయ రంగాన్ని మరింత నిర్వీర్యం చేశాయి. పశ్చిమ దేశాల ఆంక్షలను ఎదుర్కొనడానికి రష్యా, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. కొన్ని వస్తువుల ఎగుమతులపై నిషేధం, లైసెన్సింగ్ అవసరాలు పెరగడం (సమ్మిళిత ఎరువులతో సహా, యుద్ధానికి ముందు పేర్కొన్న అవసరాలతో పాటు), ఎగుమతి పన్నులు పెంచడం ఈ ఆంక్షల్లో వున్నాయి. ఇతర దేశాలకు తిరిగి ఎగుమతి చేసే భారత్ వంటి దేశాలకు వ్యూహాత్మక ప్రత్యక్ష అమ్మకాలతో పాటు రష్యా ఈ చర్యలు తీసుకుంది.

జులై చివరిలో, సెయింట్ పీటర్స్ బర్గ్‌లో రెండో రష్యా-ఆఫ్రికా ఆర్థిక, మానవతా వేదిక సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో ఈ అంశాలన్నీ ప్రధానంగా చర్చకు వస్తాయి. సదస్సుకు ముందు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసాతో సమావేశమైన రష్యా అధ్యక్షుడు పుతిన్, ఆఫ్రికా ఖండానికి ఆహార పదార్థాలు, ఎరువులు ఎగుమతి చేయడంలో రష్యా ఎదుర్కొంటున్న సమస్యలను తెలియచేశారు. బ్లాక్ సీ గ్రెయిన్ ఇనీషియేటివ్ గురించి మాట్లాడుతూ, "ఆఫ్రికా ఖండంతో సహా అవసరమున్న దేశాలకు ఆహార ధాన్యాలను సరఫరా చేయడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. కానీ అది అమలు కావడం లేదు." అన్నారు. ఒక్క మాసం లోగా తిరిగి ఈ ఒప్పందం అమలయ్యే అవకాశాలు వున్నాయి. గతంలో నిలుపు చేయబడిన సమయాల్లో ఎప్పుడూ కూడా నాలుగు వారాలను మించలేదు. కానీ ఈసారి, తన సొంత వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేందుకు పశ్చిమ దేశాలు, రష్యాకు ఎలాంటి ఉపశమనం ఇస్తాయో ఇంకా స్పష్టం కాలేదు.

ప్రపంచం నలుమూలలా ఆకలి సమస్యతో పోరాడుతున్న లక్షలాదిమంది ప్రజలను కచ్చితంగా ఈ ఒప్పందం అమలు నిలుపుదల దెబ్బతీస్తుంది. అయితే ఇప్పటికే ఆహార మార్కెట్లలో స్పెక్యులేటివ్ కార్యకలాపాల కారణంగా ఆకలితో అలమటిస్తున్న కోట్లాదిమందిపై మాత్రం ఈ పరిణామాల ప్రభావం ప్రత్యక్షంగా వుండబోదు.

/వ్యాసకర్త 'లెఫ్ట్‌వర్డ్ బుక్స్' సంపాదకులు/

వ్యవసాయ రక్షణకై మరో పోరు

ఉద్యమం

స్వాతంత్ర్యం వచ్చేటప్పటికి మన దేశంలో 75 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. నేటికీ 49 శాతం ఈ రంగంపై ఆధారపడుతున్నారు. అయితే నాడు జిడిపిలో 61 శాతం వాటా ఉండగా నేడది 13 శాతానికి పడిపోయింది. జిడిపిలో వ్యవసాయ రంగం వాటా తగ్గిపోయేకొద్దీ రైతుల ఆదాయం తగ్గిపోయి దివాళా తీసే స్థితికి వస్తున్నారు. దీనికి పరిష్కారంగా పాలక వర్గాలు కార్పోరేట్ వ్యవసాయాన్ని చూస్తున్నాయి. మూడు రైతు వ్యతిరేక చట్టాలను చుట్టచుట్టి మోడీ నెత్తిన మొట్టి పార్లమెంటు సాక్షిగా రైతులకు క్షమాపణ చెప్పించిన ఘనత 385 రోజుల రైతుల పోరాటానిది. అయితే అప్పుడు ప్రభుత్వం చేసిన వాగ్దానాలు నేటికీ అమలుకు నోచుకోలేదు. వాటి అమలుకోసం దేశవ్యాపితంగా రెండవ పోరాటానికి రైతాంగం సన్నద్ధం అవుతోంది. మోడీ 2019 ముందు ఎన్నికల ప్రచార సభలలో కనీస మద్దతు ధరల చట్టం తెచ్చి రైతాంగానికి అండగా ఉంటామన్నారు. సి2+50 శాతం స్వామినాథన్ కమిషన్ విధానాన్ని అమలు పరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. ఆ తరువాత తమ ప్రభుత్వం పారిశ్రామికవేత్తల వైపునని తేల్చి చెప్పారు. ఆచరణలో వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు లాభపడే విధంగా ఎ2+50 శాతం విధానాన్ని అమలు పరుస్తున్నారు. ఈ సంవత్సరం వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉండే ధరల నిర్ణయ కమిటి 17 పంటలకు 5 శాతం నుండి 7 శాతం వరకు మాత్రమే మద్దతు ధరల పెంపును ప్రకటించింది. గత సంవత్సరంతో పోల్చితే అన్ని ఖర్చులూ 20 శాతానికి పైగా పెరిగాయన్నది విస్మరించారు. కేంద్ర బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి గత సంవత్సరం రూ.7500 కోట్లు ఉంటే ఈ సంవత్సరం జీరో పెట్టారు. పరిశోధనలకు పైసా కూడా పెంచలేదు. జీరో టాక్స్‌తో విదేశీ వ్యవసాయ దిగుమతులు కుప్పలుతెప్పలుగా మన దేశానికి రావడం ప్రారంభమైంది. ఈ పరిస్థితులలో పార్లమెంటు రైతుకు భరోసా కల్పిస్తూ కనీస మద్దతు ధరల చట్టం చేసి రైతాంగాన్ని కాపాడాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, డీజిల్ రేట్లు విపరీతంగా పెరిగాయి. వీటికి ఉన్న చట్టాలు చట్టుబండలు అవుతున్నాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా రైతులకు బదులు కార్పోరేట్లకు ధీమాగా మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా దిగుబడి ఆధార పంటలను కొన్ని జిల్లాలకు కొన్ని పంటలనే పేరుతో రిలయన్స్ లాంటి కార్పోరేట్ కంపెనీలకు దారాధత్తం చేసింది. పంటల బీమాలో ఒక సంవత్సరానికి దేశవ్యాపితంగా రూ.40 వేల కోట్లు మిగులుచ్చుకోగా, రాష్ట్రంలో వాటికి రూ.వందల కోట్లు మిగిలాయి. ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు అన్ని కష్టాలను అధిగమించి చేతికొచ్చిన పంటలను అమ్ముకొందామంటే ప్రభుత్వ ఏజెన్సీలు సకాలంలో ముందుకు రావడంలేదు. దాంతో బస్తాకు రూ.300 నుండి రూ.500 వరకు తక్కువకే అమ్ముకోవలసి వస్తున్నది. రైతు భరోసా కేంద్రాలు విత్తనం నుండి విక్రయం వరకు రైతుల అన్ని పనులు చూస్తాయనే ప్రభుత్వం మాటలు ఆచరణలో నీటిమూటలుగా మిగిలాయి. అవి మిల్లర్లకు, వ్యాపారస్తులకు ఊడిగం చేసే కేంద్రాలుగా ఉన్నాయి.



వి. కృష్ణయ్య

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో పథకాలకు కేటాయించిన డబ్బులు ఎటుపోతున్నాయో ఎవరికీ తెలియదు. కొత్త చీడ పీడలను ఎదుర్కోవడానికి మన వ్యవసాయ పరిశోధనా సంస్థ ద్వారా పంటల దిగుబడి, క్వాలిటీ పెరగడానికి అవసరమైన పరిశోధన కూడా సరిపడా జరగలేదు. ఇలా వుండగా సంవత్సరానికి రూ.1 లక్షా 80 వేల కోట్లతో ప్రారంభమైన గ్రామీణ ఉపాధి పథకం...ఈ సంవత్సరం రూ.60 వేల కోట్లకు కుదించబడింది. ఈ సంక్షోభ కాలంలో ఆర్థిక వ్యవస్థ కుదేలు కాకుండా ఈ మాత్రంగానైనా ఉన్నదంటే పేదలకు ఆ కొంచెం డబ్బు చేరడం వల్లేనని గుర్తించాలి. దానికి బడ్జెట్ పెంచి సమర్థవంతమైన పద్ధతులలో సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహించాలి. రాష్ట్ర బడ్జెట్‌లో నీటి పారుదలకు రూ.11 వేల కోట్లు కేటాయించింది. కానీ పైసా ఖర్చు పెట్టలేదు. ఫలితంగా గత 10 సంవత్సరాలుగా రూ.100 కోట్ల బడ్జెట్‌లో ఉన్న చిన్న ప్రాజెక్టులు కూడా 1 శాతం పని జరగలేదు. రాష్ట్రానికి జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, దాని వెనుక ఎన్నో త్యాగాలు చేసిన గిరిజన రైగాంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్రోహం చేశాయి. ఆ కుటుంబాలకు పునరావాసం ప్రప్రథమం అనే మానవతా దృక్పథాన్ని కోల్పోయారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు, పులిచింతల ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోతే ఇంతవరకు వాటిని పెట్టిన పాపాన పోలేదు. అంత అసమర్థంగా ఉంది ఈ ప్రభుత్వ నిర్వాకం. రైతును అన్ని రకాలుగా నాశనం చేసే కార్పోరేట్ విధానాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్నది. కేంద్ర ప్రభుత్వాన్ని ఓడించడం ద్వారానే ఈ విధానాలను వెనక్కు కొట్టగలం, రైతాంగాన్ని కాపాడుకోగలుగుతాం.

/వ్యాసకర్త ఎ.పి రైతుసంఘం అధ్యక్షులు/

బిజెపి జాతీయ కార్యవర్గంలో మార్పులు

- ప్రధాన కార్యదర్శిగా బండి
- సునీల్ దియోధర్ తొలగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
బిజెపి ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కొత్త జాతీయ కార్యవర్గ సభ్యులను బిజెపి ప్రకటించింది. 13 మంది ఉపాధ్యక్షులు, 9 మంది ప్రధాన కార్యదర్శులు, 13 మంది సెక్రటరీలు ఈ జాబితాలో ఉన్నారు. ప్రధాన కార్యదర్శుల్లో కొత్తగా ఇద్దరు రాగా, ఏడుగురు పాతవారే తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. రాష్ట్ర ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి సివి రమణ్ సింగ్‌కు జాతీయ స్థాయి బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బండి సంజయ్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. యుపి నుంచి రాధామోహన్ అగర్వాల్, రాజస్థాన్ నుంచి సునీల్ బన్సాల్, మధ్యప్రదేశ్ నుంచి కైలాష్ విజయవర్గీయలకు జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఎపికి చెందిన సత్యకుమార్‌ను జాతీయ కార్యదర్శి, తెలంగాణకు చెందిన డికె అరుణను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్ తారిఖ్ మన్సూర్ (ప్రస్తుతం యుపి బిజెపి ఎమ్మెల్సీ)ను ఉపాధ్యక్షులుగా నియమించారు. బీహార్ ఎంపి రాధా మోహన్ సింగ్‌ను పార్టీ ఉపాధ్యక్షుడి పదవి నుంచి తప్పించారు. పార్టీ ప్రధాన కార్యదర్శులుగా కర్ణాటకకు చెందిన సిటి రవి, అస్సాం నుండి లోక్‌సభ ఎంపి దిలీప్ సైకియాలను తొలగించారు. ఆంధ్రప్రదేశ్ కో-ఇన్‌ఛార్జి సునీల్ దియోధర్‌తోపాటు ఎంపిలు వినోద్ సోంకర్, హరీష్ ద్వివేదిలను జాతీయ కార్యదర్శి పదవి నుంచి తొలగించారు. పశ్చిమ బెంగాల్ నుంచి లోక్‌సభ ఎంపిగా ఉన్న దిలీప్ ఘోష్‌ను ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఎకె ఆంటోనీ తనయుడైన అనిల్ ఆంటోనికి జాతీయ కార్యదర్శి పదవి కట్టబెట్టారు.

కుమారుడి మరణవార్తతో ఆగిన తల్లి గుండె



ఛండీగఢ్ : కుమారుడి మరణవార్త వినడంతో.. ఓ తల్లి గుండె ఆగిపోయింది. ఈ ఘటన పంజాబ్‌లోని నవన్‌షాహ్ర్ జిల్లాలో వెలుగుచూసింది. గుర్విందర్ నాథ్ (24) ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లాడు. అక్కడ పిజ్జా డెలివరీ ఏజెంటుగా పనిచేస్తూ చదువుకుంటున్నాడు. రెండు వారాల క్రితం నాథ్‌పై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, అతడి బైకును దొంగలించారు. తీవ్ర గాయాలపాలైన గుర్విందర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని అతడి తల్లి నారీందర్ కౌర్‌కు కుటుంబ సభ్యులు చెప్పలేదు. శుక్రవారం సాయంత్రం గుర్విందర్ డెడ్ బాడీ ఢిల్లీకి చేరిందన్న విషయం తెలుసుకుని నారీందర్ కుప్పకూలిపోయింది. చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. దీంతో తల్లీకుమారుడి మృతదేహాలకు శనివారం ఒకేసారి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

బియ్యం ఎగుమతులపై రష్యా నిషేధం

మాస్కో : దేశీయ మార్కెట్‌కు మద్దతు కోసం ఈ ఏడాది చివరి వరకు బియ్యం ఎగుమతులను రష్యా నిలిపివేసింది. ముడి బియ్యం, ప్రాసెస్ చేసిన బియ్యం రెండింటి ఎగుమతులపై తాత్కాలికంగా నిషేధం విధించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబరు 31 వరకు ఈ ఆంక్షలు అమల్లో వుంటాయి. యురేసియన్ ఆర్థిక యూనియన్‌లో ఇతర సభ్య దేశాలైన ఆర్మేనియా, బెలారస్, కజకస్తాన్, కిర్గిస్తాన్‌లకు ఈ నిషేధం వర్తించదు.

ఊపందుకుంటున్న డీ డాలరైజేషన్

- తాజాగా బొలీవియా చేరిక

సక్రె: ప్రపంచంలో డీ డాలరైజేషన్ (డాలర్ స్థానే స్థానిక కరెన్సీ వాడకానికి ఉద్దేశించిన) ఉద్యమం అంతకంతకూ ఊపందుకుంటున్నది. డాలర్‌కు బదులు చైనా కరెన్సీ యువాన్‌లో వాణిజ్య లావాదేవీలను నిర్వహించాలని తాజాగా బొలీవియా తీర్మానించుకుంది. యువాన్‌లో చైనాతో వాణిజ్యం జరుపుతున్న మూడవ లాటిన్ అమెరికన్ దేశం బొలీవియా. ఇంతకుముందు అర్జెంటీనా, బ్రెజిల్ యువాన్‌లో వర్తకం సాగించాలని నిర్ణయించాయి. బొలీవియా ఆర్థిక మంత్రి మార్సెల్ మాంటెనిగ్రో శుక్రవారం నాడిక్కడ పత్రికా గోష్టిలో మాట్లాడుతూ ఇది వాస్తవికమైన, మంచి నిర్ణయం అని అన్నారు.

బోల్సనారో హయాంలో 800 మంది ఆదివాసీల హత్య

బ్రసీలియా : మితవాది జేర్ బోల్సనారో అధ్యక్షునిగా వున్న సమయంలో దాదాపు 800 మంది బ్రెజిలియన్ ఆదివాసీలు హత్యకు గురయ్యారని వార్తా కథనం వెలువడింది. బ్రెజిల్‌లో ఆదివాసీలపై హింస పేరుతో నివేదికను ఇండిజెనస్ మిషనరీ కౌన్సిల్ (సిమి) ప్రచురించింది. బోల్సనారో పదవీకాలంలో దేశవ్యాప్తంగా ఇటువంటి కేసులు 795 వున్నాయని తెలిపింది. బ్రెజిల్ బిషప్స్ జాతీయ మహాసభ (సిఎన్‌బిబి)లో ఈ నివేదికను ఆవిష్కరించారు. ఈ సమావేశాలకు ఆదివాసీ నాయకులు, సిఎన్‌బిబి, సిమి ప్రతినిధులు హాజరయ్యారు. యానోమామి తెగ ఎక్కువగా వుండే రొరైమా, అమెజోనాస్ రాష్ట్రాల్లో ఈ హత్యలు ఎక్కువగా జరిగాయి. ఆ రెండు రాష్ట్రాల్లో వరుసగా 208, 168 మంది హత్యకు గురయ్యారు. మాటో గ్రాసో రాష్ట్రంలో 146 హత్యలు నమోదయ్యాయి. ఈ మూడు రాష్ట్రాల్లో 2019, 2022 మధ్య కాలంలో అధిక సంఖ్యలో ఆత్మహత్యలు కూడా చోటు చేసుకున్నట్లు నివేదిక పేర్కొంది.

కేంద్రానికి నచ్చని గణాంకాలు

- ఐఐపిఎస్ డైరెక్టర్ జేమ్స్ సస్పెన్షన్
- చెప్పినట్లు నివేదిక ఇవ్వలేదనే వేటు!

న్యూఢిల్లీ : ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాప్యులేషన్ సైన్సెస్ (ఐఐపీఎస్) డైరెక్టర్ కేఎస్ జేమ్స్‌ను సస్పెండ్ చేస్తూ మోడీ ప్రభుత్వం అసాధారణ నిర్ణయం తీసుకుంది. నియామకాలలో అవకతవకలు జరిగాయని, అందుకే సస్పెన్షన్ వేటు వేశామని సాకు చెప్పింది. ఐఐపీఎస్ సంస్థ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేస్తుంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలు తయారు చేయడం, ప్రభుత్వం నిర్దేశించే ఇతర పనులు చేపట్టడం దాని పని. జేమ్స్‌కు శుక్రవారం సాయంత్రం సస్పెన్షన్ లేఖ పంపారని అధికార వర్గాలు ధృవీకరించాయి.

జేమ్స్ సస్పెన్షన్‌కు ప్రభుత్వం చెబుతున్న కారణం ఏదైనా వాస్తవాలు మాత్రం మరోలా ఉన్నాయి. ఐఐపీఎస్ గతంలో చేసిన సర్వేలలో వెల్లడైన అంశాలపై కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రాజీనామా చేయాల్సిందిగా ఆయనను కోరింది. అయితే అందుకు జేమ్స్ నిరాకరించారని తెలుస్తోంది. 2018లో ముంబయి కేంద్రంగా ప్రారంభించిన ఐఐపీఎస్‌కు జేమ్స్‌ను డైరెక్టర్‌గా నియమించారు. ఆ సంస్థకు మంచి గుర్తింపు లభించడానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. హార్వర్డ్ సెంటర్ నుండి పోస్ట్ డాక్టరల్ డిగ్రీ (జనాభా-అభివృద్ధి) పొందిన జేమ్స్ గతంలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఐఐపీఎస్‌లో చేరకముందు ఆయన అనేక నాయకత్వ బాధ్యతలు సైతం నిర్వర్తించారు.



కె.ఎస్.జేమ్స్

ఇబ్బంది పెట్టిన సర్వేలు

ఐఐపీఎస్ నిర్వహించిన ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 సర్వేలో బయటపడిన వాస్తవాలు ప్రభుత్వానికి అసౌకర్యాన్ని కలిగించాయి. బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జన జరగని దేశంగా భారత్‌ను ప్రధాని మోడీ 2019 అక్టోబర్ 2న ప్రకటించారు. అయితే సర్వేలో దానికి విరుద్ధమైన సమాచారం లభించింది. దేశంలోని 19% కుటుంబాలు ఇప్పటికీ బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జన చేస్తున్నారని ఆ సర్వేలో తేలింది. ఒడిషా, జార్ఖండ్, బీహార్ వంటి రాష్ట్రాలలో 30% జనాభాకు మరుగుదొడ్లే లేవని తేల్చేసింది. గ్రామీణ ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నదని, బీహార్‌లో దాదాపు సగం మందికి మరుగుదొడ్లే లేవని కఠోర సత్యాన్ని బయటపెట్టింది. పౌష్టికాహార సూచికలను మెరుగుపరచేందుకు మోడీ ప్రభుత్వం 2018లో ప్రారంభించిన 'పోషణ్ అభియాన్' పథకం పనితీరు కూడా పేలవంగానే ఉన్నదని ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 సర్వే నిగ్గు తేల్చింది. 2015-16తో పోలిస్తే 2019-21 మధ్యకాలంలో పిల్లలలో రక్తహీనత పెరిగిందని తెలిపింది. మోడీ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చేయించిన వినియోగ వ్యయ సర్వే కూడా విమర్శలకు గురైంది. ఈ సర్వే ఫలితాలతో ప్రభుత్వం విభేదించింది. ఆ తర్వాత 2019 జనవరిలో వచ్చిన నిరుద్యోగ సమాచారాన్ని కూడా పక్కనపెట్టి దానిని ఎన్నికలు ముగిసిన తర్వాతే విడుదల చేసింది. ప్రభుత్వ చర్యకు నిరసనగా జాతీయ గణాంకాల కమిషన్ తాత్కాలిక ఛైర్మన్ పీసీ మోహనన్ సహా పలువురు సభ్యులు రాజీనామా చేశారు. పది సంవత్సరాలకు ఒకసారి చేయాల్సిన జనగణనను కూడా ప్రభుత్వం వాయిదా వేస్తూ వస్తోంది. నూట యాభై సంవత్సరాలలో మొట్టమొదటిసారిగా జనగణన వాయిదా పడడం గమనార్హం. ఏదేమైనా సర్వేలలో బయటపడుతున్న వాస్తవాలను బహిర్గతం చేయకుండా తొక్కిపట్టడం వల్ల ప్రభుత్వ విశ్వసనీయత పైన, చిత్తశుద్ధి పైన అనుమానాలు తలెత్తుతున్నాయి. విధానపరమైన నిర్ణయాల పైన ప్రభావం పడితే ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయే ప్రమాదమూ ఉంది.

సిజెఐపై అనుచిత వ్యాఖ్యలు భద్రి శేషాద్రి అరెస్టు



చెన్నై : తమిళనాడుకు చెందిన ప్రముఖ విశ్లేషకుడు, పబ్లిషర్ భద్రి శేషాద్రిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మణిపూర్ మారణకాండపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన నేపథ్యంలో ఆ ఉత్తర్వులను తప్పుబడుతూ శేషాద్రి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌పైనా ఆయన రెచ్చగొట్టే రీతిలో వ్యాఖ్యానించినట్లు తెలిపారు. శేషాద్రిపై 153, 153ఏ, 505(1)(బి) సెక్షన్ల కింద కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన శేషాద్రి..ఒకవేళ ప్రభుత్వం ఏమీ చేయలేకపోతే, అప్పుడు కోర్టే చూసుకుంటుందని సిజెఐ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. సిజెఐకు గన్ ఇచ్చి మణిపూర్ పంపిద్దామని, అక్కడ ఆయన శాంతి స్థాపన చేస్తారో లేదో చూద్దామని శేషాద్రి తన ఇంటర్వ్యూలో నోరుజారారు. మణిపూర్ అనేది కొండలు ఎక్కువగా ఉండే ప్రాంతమని, క్లిష్టమైన ఆ ప్రాంతంలో హత్యలు కూడా ఎక్కువే జరుగుతుంటాయని కూడా ఆయన పేర్కొనడం గమనార్హం. ఆ హింసను మనం ఆపలేమన్న రీతిలో శేషాద్రి వ్యాఖ్యలు చేశారు. దీనిపై న్యాయవాది కవియరాసు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా శేషాద్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సుప్రీంకోర్టు సిజెఐ చంద్రచూడ్‌ను విమర్శించడం సరికాదని ఆ ఫిర్యాదులో కవియరాసు పేర్కొన్నారు. శేషాద్రి అరెస్టును బిజెపి రాష్ట్ర అధ్యక్షులు అన్నామలై ఖండించారు.

'మణిపూర్' వీడియోపై సిబిఐ దర్యాప్తు ప్రారంభం

- పలువురి అరెస్టు
- నిర్ధారించని దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ : తదుపరి దర్యాప్తుకై మణిపూర్ లైంగిక వేధింపుల కేసును సిబిఐ శనివారం చేపట్టింది. కొంతమంది వ్యక్తులు ఇద్దరు మహిళలను నగ్నంగా చేసి ఊరేగించిన ఘటనకు సంబంధించిన వీడియో ఈ నెల 19న సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయింది. సంఘటన జరిగి రెండు మాసాలు దాటిన తర్వాత పోలీసులు సామూహిక అత్యాచారం, కిడ్నాప్ కేసులను నమోదు చేశారు. ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. అయితే దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన 'మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో'ను వెలుగులోకి తీసుకొచ్చిన పలువురిని పోలీసులు అరెస్టు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. మే 3 నుండి మణిపూర్‌లో అల్లర్లు, హింసాకాండ చెలరేగుతున్నాయి. మహిళలపై లైంగిక వేధింపులు, హింసకు సంబంధించి మొదటగా నమోదైన కేసుల్లో ఇదొకటి. ఇప్పటికే మణిపూర్‌లో హింసకు సంబంధించిన ఆరు కేసులను సిబిఐ దర్యాప్తు చేస్తోంది. రాష్ట్రంలో హింసాకాండకు సంబంధించి ఇప్పటివరకు సిబిఐ ఎవరినీ అరెస్టు చేయలేదని శుక్రవారం సిబిఐ అధికారి ఒకరు చెప్పారు. పదిమందిని అరెస్టు చేసినట్లు కొన్ని మీడియా వర్గాలు పేర్కొంటున్న వార్తలను ఆయన ఖండించారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతునే వుందని, ఎవరినీ అరెస్టు చేయలేదని తెలిపారు. పైగా రాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన వారిని కూడా తాము ఇంతవరకు కస్టడీలోకి తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఒకరిని అరెస్టు చేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి కానీ వాటిని సిబిఐ ధృవీకరించలేదు.



'పుకార్లు కాదు..
నిజాలు ప్రచారం చేస్తున్నావనే నీ మీద ఆరోపణ'
(1962 లోనే ఆర్‌కె లక్ష్మణ్ వేసిన కార్టూన్)

అమెరికా, జపాన్‌లతో చిప్ యుద్ధంలో చైనా కీలక చర్య!

కీలక లోహాల ఎగుమతులను నియంత్రించాలని నిర్ణయం

బీజింగ్ : అమెరికా, జపాన్‌లతో సాగుతున్న చిప్ యుద్ధంలో చైనా కీలక నిర్ణయం తీసుకుంది. చిప్‌ల తయారీలో కీలక లోహాలైన గాలియం, జర్మానియం ఎగుమతులను, ఆ లోహాల కాంపౌండ్ల ఎగుమతులను నియంత్రిం చాలని నిర్ణయించింది. అధునాతన మైన చిప్‌లు, చిప్ తయారీ పరికరాలను చైనాకు పంపకుండా అమెరికా, జపాన్‌లు ఎగుమతుల ను నిషేధించిన నేపథ్యంలో చైనా అందుకు ప్రతిగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 1 నుండి ఈ నిర్ణయం అమలు కానున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గాలియం నైట్రైడ్, జర్మానియం డయాక్సైడ్‌లతో పాటు 38 ఉత్పత్తుల ఎగుమతులకు ప్రభుత్వ లైసెన్సుల కోసం చైనా రసాయన సరఫరాదారులు దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటన కోరింది. ఈ లోహాలను చిప్‌ల తయారీతో పాటు సమాచార పరికరాలు, వివిధ రక్షణ ఉత్పత్తుల్లోనూ ఉపయోగిస్తారు. మొబైల్ ఫోన్ల స్క్రీన్లు, సౌర ఫలకాలు, రాడార్ల సామర్ధ్యాన్ని పెంచేందుకు వాడతారు. ఈ రెండు లోహాల ఉత్పత్తిలోనూ చైనా అగ్ర స్థానంలో వుంది. 94శాతం గాలియం, 83శాతం జర్మానియం ఉత్పత్తి అయ్యేది చైనాలోనే. అయితే ఈ ఎగుమతుల నిషేధం వల్ల అమెరికా, జపాన్‌లపై ప్రభావం పరిమితంగానే వుండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇతరదేశాల నుండి దిగుమతి చేసుకోవడమో లేదా దేశీయంగానే ఉత్పత్తి చేసుకోవడమో చేస్తారని భావిస్తున్నారు. అయితే అందుకయ్యే వ్యయం కూడా చాలానే వుంటుంది. అయితే అమెరికా, జపాన్ చిప్‌ల తయారీ క్రమాన్ని మందగింపచేయడమే చైనా లక్ష్యమని చైనా వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ పారిశ్రామిక, సరఫరా మార్గాలు భద్రంగా, సురక్షితంగా వుండాలన్నదే చైనా అభిమతమని, దానికే కట్టుబడి వుంటామని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు.

కొత్త ప్రభుత్వాధినేతగా నైజర్ జనరల్

నియామె : కొత్త ప్రభుత్వాధినేతగా నైజర్ జనరల్‌ను సైన్యం ప్రకటించింది. జాతీయ, అంతర్జాతీయ మద్దతు కావాలంటూ జనరల్ విజ్ఞప్తి చేసిన కొద్ది గంటలకే ఈ ప్రకటన వెలువడింది. కాగా దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ సంక్షోభం జిహాదీలపై పోరును దెబ్బతీయగలదన్న ఆందోళనలు పెరుగుతున్నాయి. దేశ రాజ్యాంగం రద్దు చేయబడిందని, జనరల్ అబ్దుర్‌రహమాన్ టెకియాని ఇన్‌చార్జిగా వున్నారని సైనిక ప్రతినిధి కల్నల్ మేజర్ అమదోవు అబ్దరామెనె టివిలో ప్రకటించారు. అధ్యక్ష భవన గార్డులు అధ్యక్షుడిని నిర్బంధించినప్పటి నుండి మిలటరీలోని వివిధ వర్గాలు ఆధిపత్యం కోసం ఘర్షణ పడుతున్నాయి. నైజర్‌లో సైనిక కుట్రను అంతర్జాతీయ సమాజం, పశ్చిమ ఆఫ్రికా ప్రాంతీయ గ్రూపు ఎకోవాస్ తీవ్రంగా ఖండించింది. దేశంలో నెలకొన్న పరిస్థితిపై అత్యవసరంగా సమీక్ష జరిపి, ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించేందుకై ఆదివారం అబుజాలో అత్యవసర సమావేశం జరగనుంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి కూడా అత్యవసరంగా సమావేశమై చర్చించింది. నైజర్‌లోని పౌర, సైనిక సిబ్బందిపై తీవ్రవాదులు దాడులు జరుపుతున్నారు. కానీ పొరుగున వున్న మాలి, బుర్కినో ఫాసోల్లో నెలకొన్నంతగా భయంకరమైన పరిస్థితులు లేవు.



సహాయక శిబిరంలో తలదాచుకున్న బాధితులను పలకరిస్తున్న 'ఇండియా' ప్రతినిధి బృందం

కేంద్రం నిద్రపోతోందా?

(మొదటి పేజీ తరువాయి)
ప్రాంతాలను సందర్శించింది.

ఎంపిలు రాజీవ్ రంజన్ సింగ్, అనిల్ ప్రసాద్ హేగ్డే (జెడియు), గౌరవ్ గోగోయ్ (కాంగ్రెస్), పి.పి మహ్మద్ ఫైజల్ (ఎన్‌సిపి), ఈ.టి మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), ఎన్.కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్‌ఎస్‌పి), సుశీల్ గుప్తా (ఆప్), అరవింద్ సావంత్ (శివసేన, ఠాక్రే), మహువా మాఝీ (జెఎంఎం), జయంత్ చౌదరి (ఆర్‌ఎల్‌డి)లతో కూడిన మరో ఇండియా కూటమి బృందం చురచంద్‌పూర్‌లోని డాన్ బాస్కో స్కూల్‌లోని సహాయ శిబిరాన్ని సందర్శించింది. అక్కడ ప్రజలతో మాట్లాడి వారి గోడును ఆలకించింది. అటు పిమ్మట ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలోని అకంపేట్‌లోని ఐడిల్ గర్ల్స్ కాలేజీ, ఇంఫాల్ వెస్ట్‌లోని లంబోయిఖోంగాంగోన్‌లోని సహాయక శిబిలను సందర్శించింది. కుకీ, మెయితీ కమ్యూనిటీ సభ్యులను ఈ బృందం కలుసుకుంది.

బాధితులను పరామర్శించిన అనంతరం అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలు దేశ ప్రతిష్టను మాత్రమే కాదు, యావత్ ఈశాన్య ప్రాంత ప్రతిష్టను మంటగలిపాయని అన్నారు. జాతి ఘర్షణల బాధితులను కలవడానికి, సమస్యను తెలుసుకునేందుకు తాము ఇక్కడకు వచ్చాము. హింసకు ముగింపు పలకాలని, శాంతిని త్వరగా పునరుద్ధరించాలని కోరుకుంటున్నాము. మణిపూర్‌లో ఏమి జరుగుతుందో ప్రపంచం మొత్తం గమనిస్తోందని అన్నారు. కేంద్రం సిబిఐ దర్యాప్తు గురించి మాట్లాడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిద్రపోతుందా? అని ప్రశ్నించారు. మణిపూర్‌లో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. "మణిపూర్ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వారు ప్రభుత్వంపై పూర్తిగా నమ్మకం కోల్పోయారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం వారికి అందడం లేదని అన్నారు. ఇప్పటి వరకు మణిపూర్‌లో పర్యటించే తీరికే ప్రధాని మోడీకి లేకపోయిందని విమర్శించారు.

టిఎంసి ఎంపి సుస్మితా దేవ్ మాట్లాడుతూ "బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ముఖ్యమంత్రి బిజెపి మనిషి కనుక ఆయనను తొలగించటం లేదు. పోయిన ప్రజల ప్రాణాలకు, మణిపూర్ హింసకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె అన్నారు. అత్యాచార బాధితురాలిని కలిసిన తరువాత డికెఎం ఎంపి కనిమొళి మాట్లాడుతూ కుమార్తెను వేధింపులకు గురిచేసి, అత్యాచారం చేయడం, అదే రోజుతన భర్త, కొడుకును కోల్పోయి బోరుమని రోదిస్తున్న ఆ మహిళ బాధ వర్ణనాతీతం అని అన్నారు. కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ మీడియాతో మాట్లాడుతూ.. మణిపూర్‌లో శాంతి నెలకొందని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, అదే నిజమైతే ప్రజలు సహాయక శిబిరాల్లో ఎందుకు మకాం వేసి తమ ఇళ్లకు ఎందుకు వెళ్లలేకపోతున్నారని ప్రశ్నించారు.

నేడు గవర్నర్‌తో ప్రతిపక్ష ఎంపిలు భేటీ

నేడు (ఆదివారం) రాజ్‌భవన్‌లో మణిపూర్ గవర్నర్ అనుసూయా ఉకేతో ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపిలు భేటీ కానున్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న పరిస్థితి, శాంతిని నెలకొల్పడానికి సాధ్యమయ్యే చర్యల గురించి చర్చిస్తారు. కాగా గవర్నర్ అనుసూయా ఉయికే చురచంద్‌పూర్‌లోని సహాయక శిబిరాన్ని సందర్శించి చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. మెయితీ, కుకీ కమ్యూనిటీల మధ్య బంధాన్ని దెబ్బతీసిన ద్వేషం, అపనమ్మకాన్ని అంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.



బుద్ధదేవ్ భట్టాచార్యకు తీవ్ర అస్వస్థత

- వెంటిలేటర్‌పై చికిత్స
- నిలకడగా ఉందన్న వైద్యులు

కోల్‌కతా : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నాయకులు బుద్ధదేవ్ భట్టాచార్య (79) శనివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనను నగరంలోని ఉడ్‌ల్యాండ్స్ ఆసుపత్రికి తరలించారు. బుద్ధదేవ్ కొంతకాలంగా ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం బుద్ధదేవ్‌ను పరీక్షించిన వైద్యులు నెబ్యులైజర్ ఉపయోగించినా.. ఊపిరి ఆడటం కష్టమవుతోందని గుర్తించి ఆసుపత్రికి తరలించాలని సూచించారు. వెంటనే గ్రీన్ ఛానెల్ ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ఆయనను సమీపంలోని వుడ్‌లాండ్స్ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకొచ్చిన సమయంలో బుద్ధదేవ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఆక్సిజన్ లెవెల్స్ 70 శాతం మేర పడిపోయాయని వైద్యులు తెలిపారు. క్రిటికల్ కేర్ యూనిట్‌లో నాన్ ఇన్వాసివ్ వెంటిలేటర్‌పై ఉంచి వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణుల బృందం క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నదని ఉడ్‌ల్యాండ్స్ ఆసుపత్రి ఎండి, సిఇఒ డాక్టర్ రూపాలి బసు శనివారం సాయంత్రం విడుదల చేసిన బులిటెన్‌లో పేర్కొన్నారు. అవసరమైన ఇన్వెస్టిగేషన్స్ చేశామని, రిపోర్టులు ఇంకా రావాల్సి ఉందని ఆ బులిటెన్‌లో తెలిపారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. బుద్ధదేవ్ ఆరోగ్యపరిస్థితిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, ఇతర నాయకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భట్టాచార్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉడ్‌ల్యాండ్స్ విడుదల చేసిన బులిటెన్‌ను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. కార్డియాలజిస్టులు, పల్మోనాలజిస్టుల పర్యవేక్షణలో భట్టాచార్యకు వైద్యం కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్ర గవర్నరు ఆనంద్ బసు ఆసుపత్రికి వెళ్లి బుద్ధదేవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా బుద్ధదేవ్ ఆరోగ్యస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

పులుల సంఖ్యలో మధ్యప్రదేశ్ ఫస్ట్

- కర్ణాటక సెకండ్

మైసూరు : దేశంలోకెల్లా మధ్యప్రదేశ్‌లో పులులు అత్యధిక సంఖ్యలో వున్నాయి. 785 పులులతో మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో వుండగా, 563 పులులతో కర్ణాటక రెండో స్థానంలో వుందని భారత్‌లో 2022లో పులుల స్థితిగతులపై వెలువరించిన నివేదిక పేర్కొంది. శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా జాతీయ పులుల సంరక్షణ సంస్థ (ఎన్‌టిసిఎ) ఈ నివేదికను విడుదల చేసింది. 2006 నుండి దేశవ్యాప్తంగా పులుల సంఖ్యను లెక్కించడం ఆరంభించారు. అప్పటి నుండి నెమ్మదిగా సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈనాడు మొత్తంగా దేశంలో 3682 పులులు వున్నాయి. 2018నాటి నివేదిక ప్రకారం, కర్ణాటకలో 524 వుండగా, మధ్య ప్రదేశ్‌లో 526 వున్నాయి. ఈ నాలుగేళ్ళ కాలంలో కర్ణాటకలో 37పులులు పెరగ్గా, మధ్యప్రదేశ్‌లో ఏకంగా 259 పెరిగాయి. సుశిక్షితులైన సిబ్బంది పెరగడం, తనిఖీలు పెరగడం, మరిన్ని ప్రాంతాల్లో రక్షణ చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాల వల్ల సంఖ్య పెరిగిందని అడవుల (వన్యప్రాణుల) అదనపు ముఖ్య సంరక్షణాధికారి కుమార్ పుష్కర్ తెలిపారు.

6 జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటలు : సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాల్లోని 130 మండలాల్లో లోటు వర్షపాతం నెలకొందని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు వీలుగా కంటిజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వరద, కరువు పరిస్థితులపై శనివారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, పశుసంవర్ధక, పట్టుపరిశ్రమ, ఉద్యానవన శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. అధిక వర్షాలు కారణంగా వరి నారుమడులు దెబ్బతిన్న రైతులకు స్వల్పకాలంలో దిగుబడినిచ్చే విత్తనాల సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు పశుగ్రాసం సరఫరా చేయడంపైనా సమీక్షించారు. వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్‌లో మొత్తం 34.39 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణం సాగు కాగా, ఇప్పటి వరకు 9.22 లక్షల హెక్టార్లలో పంటలు వేశారన్నారు. నారుమడులు దెబ్బతిన్న రైతులకు స్వల్పకాలంలో పంట దిగుబడినిచ్చే సుమారు 30 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేశామన్నారు. లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో రానున్న నెలల్లో వర్షాలు పడక ఆ లోటు భర్తీకాకుంటే ప్రత్నామ్నాయ పంటలు వేసుకునేందుకు వీలుగా సుమారు 10 వేల క్వింటాళ్ల పలు రకాల విత్తనాలను ఎపి సీడ్స్ వద్ద సిద్ధంగా ఉంచామని చెప్పారు.

పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనులు వేగవంతం

రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట (భావనపాడు) పోర్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను సిఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంపై పరిశ్రమలు, ఎపిఐఐసి తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జువ్వలదిన్నె, నిజాంపేట, ఉప్పాడ, మచిలీపట్నం, ఫిషింగ్ హార్బర్ల మొదటి దశ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఎపిఐఐసి ఎమ్‌డి ప్రవీణ్ కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుల ప్రగతిని వివరించారు.

ఎస్ఐపిబి ప్రాజెక్టులపై..

స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపిబి) ఆమోదించిన పరిశ్రమలపై జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎస్ఐపిబి ఆమోదం పొందిన ప్రాజెక్టుల ప్రగతిపై ప్రతి 15 రోజులకు నివేదిక సమర్పించాలని పరిశ్రమల శాఖ కమిషనరు ప్రవీణ్‌కుమార్‌ను సిఎస్ ఆదేశించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో చేసుకున్న ఒప్పందాల్లో భాగంగా డిసెంబరు నెలాఖరులోపు మరో 36 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.




మీకోసం

గంజిలో కొద్దిగా ఉప్పు కలిపి, తెల్లని దుస్తులను ఉతికితే అవి మరింత తెల్లగా ఉంటాయి.

జీవన సౌరభం

సాధించిన విజయం కన్నా.. దాని కోసం చేసిన ప్రయత్నం చాలా గొప్పది.

బాధ్యతా రాహిత్యం



సిద్ధిపేట అనే పట్టణంలో శ్రీనివాస్, కళ అనే దంపతులు ఉన్నారు. వారి పిల్లలు కిరణ్, ఉష. వేసవి సెలవుల్లో ఆ కుటుంబం అంతా బీచ్‌కు వెళ్లారు. పిల్లలిద్దరూ బీచ్‌లో సరదాగా ఆటలాడుకున్నారు. తినుబండారాలు కొని తిన్నారు. ఫొటోలు దిగి చాలా సంతోషించారు. ఇంతలో బీచ్‌లో నడుస్తున్న ఉష కాళ్ళకు ప్లాస్టిక్ బాటిళ్లు తగిలాయి. అక్కడ పడేసిన ఖాళీ బాటిళ్లు, కవర్లు వంటి ప్లాస్టిక్ వస్తువులను చూసి 'డాడీ, ప్లాస్టిక్ వస్తువులను ఇలా పడేస్తే, సముద్రం కలుషితమవుతుంది. చేపలు చనిపోతాయి కదా" అని అడిగింది. అప్పుడు వాళ్ల నాన్న "నిజమేనమ్మా, మనుషుల్లో బాధ్యతా రాహిత్యం ఎక్కువైంది" అన్నాడు.


ఉష అక్కడున్న చాలా మందిని గమనించింది. కొందరు ప్లాస్టిక్ కవర్లలో తెచ్చుకున్న తినుబండారాలు తినేసి, కవర్లు అక్కడే పడేస్తున్నారు. మరికొందరు తాగిన వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్ బాటిళ్లు పడేస్తున్నారు. అక్కడి వాతావరణం చూసి ఉషకు చాలా బాధేసింది. వెంటనే ఉష, కిరణ్ బీచ్‌లో నడుస్తూ.. 'ప్లాస్టిక్ వస్తువులను చెత్త కుండీలోనే వేయండి. సముద్రాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడండి' అని బిగ్గరగా అరిచారు.

ఇలా ఇద్దరు పిల్లలు నినాదాలు చేసుకుంటూ బీచ్ అంతటా తిరిగారు. చాలామంది వీరిని వింతగా చూశారు. కొంత మంది వీరి తపన చూసి మెచ్చుకున్నారు. ఎవరైతే ప్లాస్టిక్ వస్తువులతో కలుషితం చేసారో, వారు సిగ్గుపడ్డారు. కింద పడేసిన వస్తువులను తీసి చెత్త కుండిలో వేశారు. వారిలో వచ్చిన మార్పు చూసి పిల్లలిద్దరూ చాలా సంతోషపడ్డారు. ఇక నుండి వారం వారం బీచ్‌కు వచ్చి ఇలా ప్రచారం చేస్తామని నాన్నతో చెప్పారు. ప్రకృతి పట్ల పిల్లలు చూపిస్తున్న ప్రేమకు సంతోషపడిన శ్రీనివాస్ అలాగేనని చెప్పాడు.



- కొంపల్లి విశిష్ట,
9వ తరగతి, జక్కాపూర్, సిద్ధిపేట జిల్లా.

సరైన ఆకృతి రాయండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని ఆకృతులను ఇచ్చాం. కింద ఇచ్చిన బొమ్మలకు సరిపోయే ఆకృతిని మీరు రాయండి.

నేను గీసిన బొమ్మ



- జి పార్వతి, 7వ తరగతి,
అరవింద హైస్కూలు, కుంచనపల్లి.




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఊరి కోసం ఉపాధ్యాయుడయ్యాడు ...

ఒకపక్క సమాజం ఆధునిక పోకడలతో సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకెళుతుంటే.. మరోపక్క తొలితరం వారసులు స్కూలుకు వెళ్లేందుకు కూడా కనీస సదుపాయాలు లేని జనావాసాలున్నాయి. అటువంటి ప్రాంతమే మినాప్. ఛత్తీస్‌గఢ్‌లో ఉంది. ఊరికి దూరంగా, అడవి మధ్యలో ఉన్న అక్కడ చుట్టుపక్కల గ్రామాల మొత్తం జనాభా 900 కూడా దాటదు. అటువంటి చోట ఆ అడవి బిడ్డలూ చదువుకోవాలని ఓ యువకుడు ఆరాటపడుతున్నాడు. అతడి మాటల్లోనే ఆ ఊరి కథ విందాం.





"**నా** పేరు హుర్రా. మా గ్రామం నక్సల్స్, సాయుధ పోలీసుల రాకపోకలతో నిరంతరం ఉద్రిక్తతలతో నిండి ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఊళ్లో స్కూలు లేక హాస్టల్లో ఉండి చదువుకున్నాను. సెలవుల్లో ఊరికి వస్తే ఇక్కడి పరిస్థితులు చూసి చాలా భయమేసేది. ఊరు దాటేటప్పుడు, ఊళ్లోకి వెళ్లేటప్పుడు పోలీసులు తనిఖీలు ఉండేవి. ఒక్కోసారి నక్సల్స్ కూడా మాపై నిఘా పెట్టేవారు. మా ప్రాణాలకు రక్షణ లేదు. ఇటువంటి చోట ఈ ప్రాంత ప్రజలందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. పంటలు లేని కాలంలో వలసలు పోయి బతుకుతారు. పిల్లలు కూడా వారితోనే ప్రయాణిస్తుంటారు. చదువు లేక, భవిష్యత్తుపై ఏవిధమైన అవగాహన లేకుండానే ఎంతోమంది జీవితాలు గడిపేస్తారు. వీటన్నింటినీ చిన్నప్పటి నుండి చూస్తూ పెరిగిన నేను 12వ తరగతి పూర్తి చేసి గ్రామానికి వచ్చాను. ఉన్నత చదువు చదవాలని ఉన్నా స్తోమత లేదు. ఈ లోపు లాక్‌డౌన్ పడింది.

ఒక పక్క ప్రజల ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు విద్యార్థులను చదువుకు దగ్గర చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మా ప్రాంత పిల్లలను చదువుకు దగ్గర చేయాలనుకున్నాను. దేశంలో చాలా ప్రాంతాల్లో ఆన్‌లైన్ విద్య కొనసాగుతోంది. ఇక్కడ మాత్రం అది సాధ్యం కాదు. ఎందుకంటే గ్రామస్తుల్లో చాలామందికి ఫోన్లు లేవు. కొంతమందికి కీప్యాడ్ మొబైల్స్ ఉన్నాయి. ఒకరిద్దరి దగ్గర స్మార్ట్ ఫోను ఉన్నా, డేటా ఉండేది కాదు. ఈ పరిస్థితుల్లో ఆఫ్‌లైన్‌లో పిల్లలకు చదువు నేర్పాలనుకున్నాను.

కోవిడ్ సమయంలోనైతే చుట్టుపక్కల గ్రామాలన్నీ తిరిగేవాడిని. ఇంటింటికీ వెళ్లి పుస్తకాలు పంచేవాడిని. లాక్‌డౌన్ ముగిసిన తరువాత ఈ పిల్లలందరికీ ఏదైనా స్థిరనివాసంలో విద్య నేర్పించాలనుకున్నాను. అయితే అది అంత సులభం కాదు. ఒక గుడిసె కట్టాలన్నా నా ఒక్కడి వల్ల కాదు. అందుకే తల్లిదండ్రులను సంప్రదించాను. మొదట్లో వారు సుముఖత చూపించలేదు. 'మాకు బడి ఎందుకు.. చదువు ఎందుకు.. దండగ పనులు వద్దు.. అనేవారు. అయినా నేను పట్టు వదల్లేదు. తల్లిదండ్రులతో, పెద్దలతో పదే పదే మాట్లాడి, వారిలో ఒక నమ్మకం కలిగించాను. ఊరందరి సహకారంతో పాఠశాల కోసం ఒక పాక నిర్మించాం. రోజూ ఉదయాన్నే నిద్ర లేచి అడవి నుండి కలప తేవడంతో నా దినచర్య మొదలవుతుంది. తరువాత పొలం పని చేస్తాను. ఉన్న కాస్త పొలంలో కుటుంబ సభ్యులతో కలిసి వరి చేను సాగు చేస్తాను. స్కూలు సమయానికి పని పూర్తి చేసుకుని, గ్రామంలోని పిల్లలను కదలించి, బడికి తీసుకెళ్తాను. నాకు గ్రామస్తులు మాట్లాడే గోండీ భాష తెలుసు. అలాగే హిందీ కూడా వచ్చు. పిల్లలకు అక్షరాలు నేర్పిస్తాను. పాఠ్యపుస్తకాల్లోని కథలను, పాటలను పిల్లలకు అర్థమయ్యేలా బోధిస్తాను. పాటలు పాడిస్తాను. గోండీ భాషలోకి అనువదించి, అర్థాలు వివరిస్తాను. మొదట్లో స్కూలుకు పిల్లలు వచ్చేవారు కాదు. పిల్లలను స్కూలుకు రప్పించడం కోసం ఎన్నో కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొనేవాడిని. కథలు, పాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చదువు అవసరాన్ని వివరించేవాడిని. కథలు, పాటలు వినిపిస్తే పిల్లలు ఆసక్తి చూపేవారు. బడికి వస్తే అలాంటివి ఇంకా బోలెడు నేర్చుకోవొచ్చని చెప్పేవాడిని. అలా ఆకర్షితులైన పిల్లలు ఇప్పుడు ఎంతో శ్రద్ధగా బడికి వస్తున్నారు. రాయడం, చదవడం నేర్చుకుంటున్నారు. వారు ఇంకా ఇంకా చదువుకోవడం ద్వారా ఊరు, వారి భవిష్యత్తు మారతాయని నేను నమ్ముతున్నాను."

హుర్రా నమ్మకం తప్పక నెరవేరాలని మనమూ ఆశిద్దాం. అలాగే, ప్రభుత్వం పూనుకొని అక్కడ స్కూలును పున:నిర్మించి, ఆదివాసీ బాలల కు విద్యను అందించాల్సిన అవసరం ఉంది.

ఆ ఊళ్లో 2005 వరకు స్కూలు ఉండేది. సల్వాజుడుం కార్యకలాపాల్లో అది కూలిపోయింది. విద్యాబోధన ఆగిపోయింది. సుప్రీం కోర్టు 2011లో ఇచ్చిన ఆదేశాల మేరకు 2019లో పాఠశాల నిర్మాణం ప్రారంభమైంది. కానీ, అది ఇప్పటికీ పూర్తి కాలేదు. గోడలు, పై కప్పు లేని స్తంభాల దశలోనే మిగిలి ఉంది. 15 ఏళ్లుగా అక్కడి పిల్లలకు చదువు అందకుండా పోయింది. అలాంటి పరిస్థితిలో హుర్రా 'చదువు చెప్పటానికి నేనున్నాను.' అని ముందుకొచ్చాడు. రోజూ గ్రామస్తులతో కలిసి వ్యవసాయ పనులు చేస్తాడు. పంటలు లేని కాలంలో మార్కెట్లో దినసరి కూలీగా చేస్తాడు. ఇన్ని కష్టాల నడుమ పిల్లలకు చదువు నేర్పిస్తున్నాడు. అతడి కృషి అభినందనీయం.

సహకారంపై బిగిస్తున్న కేంద్రం పట్టు

- పలు మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రాల పరిధిలోని సహకార రంగంపై కేంద్ర ప్రభుత్వం మరింతగా పట్టుబిగిస్తోంది. ఇప్పటికే జాతీయ స్థాయిలో మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా వాణిజ్య బ్యాంకుల తరహాలో వాటిని మార్చేందుకు కసరత్తు ప్రారంభించింది. దీనిలో భాగంగా కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. వాటిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది. సహకార బ్యాంకులు గరిష్టంగా ఐదు కొత్త శాఖలను ప్రారంభించుకోవచ్చని పేర్కొంది. సహకార బ్యాంకుల బోర్డు రాజీ ఒప్పందాలు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్లు, వంటివాటిపై నేరుగా నిర్ణయాలు తీసుకోవచ్చని పేర్కొంది. ప్రాధాన్య తా రంగంపై రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు పట్టణ సహకార బ్యాంకులకు అదనంగా రెండేళ్ల కాలపరిమితిని కూడా కల్పించాలని నిర్ణయిం చారు. సహకార బ్యాంకుల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, సిఇలను నియమించుకోవాలన్నా, తొలగించాలన్నా, పునర్నియామకం చేయాలన్నా 90 రోజుల గడువు ఇచ్చారు. అలాగే ఆడిటర్లకు సంబంధించి 30 రోజుల గడువు ఇచ్చారు.ఈ బ్యాంకుల దైనందిక వ్యవహారాల కోసం రిజర్వ్‌బ్యాంకు ఒక నోడల్ అధికారిని కూడా నియమించనుంది. బ్యాంకు సేవలను ఇళ్లవద్దకు వెళ్లి అందించేందుకు, ఒక వ్యక్తికి రెండుసార్లుకన్నా ఎక్కువ పర్యాయాలు వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు అంగీకరిస్తున్నట్లు ఈ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. వీటిప్రకారం వాణిజ్య రియల్ ఎస్టేట్ రంగంలోని నివాస గృహాలకు కూడా సహకార బ్యాంకులు రుణాలు ఇవ్వొచ్చు.

ఇషాన్, గిల్ మెరిసినా.. భారత్ 181ఆలౌట్ వర్షం అంతరాయం



బార్బొడోస్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ 181పరుగులకు ఆలౌటైంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను ఓపెనర్లు ఇషాన్ కిషన్(55), శుభ్‌మన్ గిల్(34) 90 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో శుభ్‌మన్‌ను విండీస్ బౌలర్ కూల్చడంతో టీమిండియా పతనం మొదలైంది. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 90పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత టీమిండియా వరుసగా వికెట్లను కోల్పోయింది. సంజు శాంసన్(9), అక్షర్ పటేల్(1), కెప్టెన్ హార్దిక్ పాండ్యా(7), కుల్దీప్(8 నాటౌట్), ఉమ్రన్(0), ముఖేష్(6) సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా.. సూర్యకుమార్ యాదవ్ (24), జడేజా(10), శార్దూల్(16) రెండంకెల స్కోర్ చేశారు. మోటీ, షెఫర్డ్‌కు మూడేసి, జోసెఫ్‌కు రెండు, సెలెస్, కరియకు ఒక్కో వికెట్ దక్కాయి. టీమిండియా ఇన్నింగ్స్‌కు పలుమార్లు వర్షం అడ్డంకిగా నిలిచాడు.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి)అథంజే (బి)షెఫర్డ్ 55, శుభ్‌మన్ (సి)జోసెఫ్ (బి) మోటీ 34, సంజు శాంసన్ (సి)కింగ్ (బి)కరియా 9, అక్షర్ పటేల్ (సి)హోప్ (బి)షెఫర్డ్ 1, హార్దిక్ పాండ్యా (సి)కింగ్ (బి)సెలెస్ 7, సూర్యకుమార్ యాదవ్ (సి)అథంజె (బి)మోటీ 24, జడేజా (సి)కారియ (బి)షెఫర్డ్ 10, శార్దూల్ (ఎల్‌బి)జోసెఫ్ 16, కుల్దీప్(నాటౌట్) 8, ఉమ్రన్(సి)కర్టీ (బి)జోసెఫ్ 0, ముఖేష్(సి)హెట్‌మైర్ (బి)మోటీ 6, అదనం 11. (40.5 ఓవర్లలో ఆలౌట్) 181పరుగులు. **బౌలింగ్:** మయర్స్ 5-0-18-0, సెలెస్ 6-0-29-1, జోసెఫ్ 7-0-35-2, మోటీ 9.5-0-36-3, షెఫర్డ్ 8-1-37-3, కరియా 5-0-25-1.

లాల్‌రిమిసిమి హ్యాట్రిక్

ఇంగ్లండ్‌పై 3-0తో గెలుపు



మాడ్రిడ్: స్పెయిన్ 100ఏళ్ల ఉత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్ టోర్నమెంట్‌లో భారత మహిళల హాకీ జట్టు ఘన విజయం సాధించింది. శనివారం జరిగిన పోటీలో భారత్ 3-0గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. భారత్ తరపున మూడు గోల్స్‌ను స్ట్రయికర్ లాల్‌రిమిసిమి చేయడం విశేషం. తొలి అర్ధభాగంలో 13, 17వ నిమిషాల్లో ఒక్కో గోల్ కొట్టిన లాల్‌రిమ్.. హ్యాట్రిక్ గోల్‌ను 56వ నిమిషంలో చేసింది. ఈ పర్యటనలో భారత్‌ను దక్కిన తొలి విజయం ఇదే. తొలి రెండు గేమ్‌లలో ఇంగ్లండ్‌పై 1-1తో, స్పెయిన్‌పై 2-2గోల్స్ మ్యాచ్‌లను డ్రా చేసుకున్న భారత్.. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. దీంతో ఈ టోర్నమెంట్‌లో పరాజయం చవిచూడలేదు. గోల్‌కీపర్ సవిత ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌కు జట్టుకు అందుబాటులోకి రానుంది. గోల్‌కీపర్ నేహా గోయల్ డిఫెన్స్‌లో ఆకట్టుకుంది. లాల్‌రిమ్ తొలి గోల్‌చేసే సందర్భంలో డీప్ గ్రేస్ ఎక్కా, మిడ్‌ఫీల్డ్‌లో బంతిని అందించి 13వ నిమిషంలో గోల్ చేసేందుకు దోహదపడింది. దీంతో భారత్ తొలి క్వార్టర్‌లోనే 2-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ స్పెయిన్‌తో తలపడనుంది.

సెమీస్‌లో లక్ష్యసేన్ ఓటమి

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

టోక్యో: జపాన్ ఓపెన్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో లక్ష్యసేన్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో ఓటమిపాలయ్యాడు. ఉత్కంఠ భరిత సెమీస్‌లో లక్ష్యసేన్ 15-21, 21-13, 16-21తో ఇండోనేషియా షట్లర్ జొనాథన్ క్రిస్టీ చేతిలో పోరాడి ఓడాడు. దాంతో ఇండోనేషియా షట్లర్ జొనాథన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మరో సెమీస్‌లో టాప్‌సీడ్ విక్టర్ అక్సెల్సన్(డెన్మార్క్) 4వ సీడ్ నరోకాపై 11-21, 21-19, 21-14తో గెలిచి ఫైనల్‌కు చేరాడు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి 5వ సీడ్ హీ-బింగ్జియావో(చైనా), 2వ సీడ్ సన్-యే-యంగ్(కొరియా) ప్రవేశించారు.

ఇంగ్లండ్ 389/9

యాషెస్ సిరీస్ చివరి టెస్ట్

లండన్: యాషెస్ సిరీస్ చివరి టెస్ట్‌లో రసకందాయంలో పడింది. శనివారం ఇంగ్లండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో మూడోరోజు ఆట ముగిసే సమయానికి 9వికెట్ల నష్టానికి 389పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 12పరుగులు వెనుకబడ్డ ఇంగ్లండ్ జట్టును క్రాలే(73), బెయిర్‌స్టో(78), జో రూట్ (91) అర్ధసెంచరీలకి తోడు డకెట్(42), స్టోక్స్(42) ఆదుకున్నారు. క్రీజ్‌లో బ్రాడ్(2), ఆండర్సన్(0) ఉండగా.. ఇంగ్లండ్‌కు 377పరుగుల ఆధిక్యతల లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 283, ఆస్ట్రేలియా 295పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి...

పోరాటమే ఏకైక మార్గం

- 'ప్రజాశక్తి'తో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

'విద్యుత్ రంగానికి ఎంత ప్రాధాన్యత ఉందో అంత ఎక్కువగా సమస్యలూ అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటమే ఏకైక మార్గం' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు తెలిపారు. ఆగస్టు పది నుంచి విద్యుత్ రంగ కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్న నేపథ్యంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

ప్రజాశక్తి : విద్యుత్ రంగంలో ప్రధానమైన ప్రమాదం ఏంటి?

సిహెచ్ నర్సింగరావు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ప్రయివేట్, కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ... ఈ మూడు విభాగాలను ఒక్కొక్కటిగా అమ్మేందుకు పూనుకుంటున్నారు. కేంద్రం 2022లో తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లు ఇందులో భాగమే. ఇలాంటి పరిస్థితుల్లో సంస్థలు, కార్మికుల సంక్షేమాన్ని, హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది.

ప్రజాశక్తి : సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి జెఎసి ఉద్యమిస్తుందా?

సిహెచ్ నర్సింగరావు : జెఎసి ఆ పని చేయడం లేదు. విద్యుత్ కార్మికులకు పిఆర్‌సి అమలు చేయడంలో విఫలమైంది. మూడు శాతం ఫిట్‌మెంట్‌తో సరిపెట్టుకుంది. పిఆర్‌సి ప్రకటించకుండా యాజమాన్యం కార్మికులను అవహేళన చేస్తున్నా జెఎసి పట్టించుకోలేదు.

ప్రజాశక్తి : జెఎసి నుంచి సిఐటియు ఎందుకు బయటకొచ్చింది?

సిహెచ్ నర్సింగరావు : జెఎసిపై నమ్మకం లేకనే సిఐటియుగా మేం బయటకు వచ్చాం. ఎఐటియుసి కూడా మాతోనే ఉంది. జెఎసితో ఉంటే న్యాయం జరగదన్న ఉద్దేశంతోనే ఎలక్ట్రిసిటీలోని సిఐటియు రాష్ట్ర నాయకులు సూరిబాబు రాజీనామా చేసి వచ్చేశారు. సిఐటియు, ఎఐటియుసి కలిసి మొత్తం ఏడు సంఘాలతో పోరాట కమిటీ ఏర్పడింది. ఈ నెల 25న విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీగా ఏర్పాటయ్యాం. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు, సిఐటియు నుంచి నేను హాజరయ్యాం. ఆగస్టు పది నుంచి విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 60 వేల మంది పర్మినెంట్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాం.

ప్రజాశక్తి : జెఎసి మీతో కలిసి వస్తుందా?

సిహెచ్ నర్సింగరావు : పోరాట కమిటీ ఏర్పడి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జెఎసి కూడా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఇది పోరాట కమిటీ తొలి విజయం. అందరినీ కలుపుకుని ఐక్య కార్యాచరణ చేపడతాం. ఏడాది కాలంగా జెఎసితో కలిసి ఉన్నాం. అయినా, వారు ఏ పోరాటానికీ పిలుపు ఇవ్వలేదు. కాంట్రాక్టు కార్మికుల సమస్య ఏనాడూ చర్చించలేదు. తెలంగాణలో కాంట్రాక్టు కార్మికులకు రూ.41 వేల జీతం కాగా, ఆంధ్రాలో వారికి రూ.20 వేలే జీతంగా ఇస్తున్నారు. మొత్తం 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు.

ప్రజాశక్తి : పోరాట కమిటీ డిమాండ్లకు ప్రభుత్వం దిగి వస్తుందా?

సిహెచ్ నర్సింగరావు : పోరాట కమిటీ ఐక్యంగా ఉద్యమిస్తుంది. ఈ నిరవధిక సమ్మెలో పోరాట కమిటీ అగ్రభాగాన ఉంటుంది. జెఎసి కడవరకూ మాతో వస్తుందో? లేదో? వేచి చూడాల్సిందే. కార్మికులు మాత్రం పోరాట కమిటీవైపే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. కార్మిక పోరాటానికి ఏ ప్రభుత్వమైనా దిగిరాక తప్పదు. విద్యుత్ కార్మికులు గతంలో అనేక పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. ప్రభుత్వం నిర్బంధం, పనిభారం పెంచింది. దీంతో, కార్మికులు ప్రభుత్వం పట్ల చాలా కోపంతో ఉన్నారు.

ఎఐతో ఉద్యోగాలు ఊడటం ఖాయం

- చాట్‌జిపిటి సృష్టికర్త శామ్ ఆల్ట్‌మన్



న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఎఐ) వల్ల ఉద్యోగాలు ఊడటం ఖాయమని చాట్‌జిపిటి సృష్టికర్త, ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. ఎఐతో ఉద్యోగాలు ప్రమాదంలో పడుతాయని స్వయంగా ఆల్ట్‌మన్ పేర్కొనడం ఆందోళకరం. గతేడాది నవంబర్‌లో అందుబాటులోకి వచ్చిన చాట్‌జిపిటి అనూహ్య ఆదరణ సొంతం చేసుకుందన్నారు. మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అలాగని ఎఐ టూల్స్ అన్నీ పరిపూర్ణం కావన్నారు. వాటికీ కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. అట్లాంటిక్ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆల్ట్‌మన్ మాట్లాడుతూ.. మానవాళిపై ఎఐ ప్రభావం పూర్తిగా సానుకూలంగా ఉండకపోవచ్చని స్పష్టం చేశారు. ఎఐ గణనీయమైన పురోగతిని చూపించినప్పటికీ, ఇది సమాజానికి సవాళ్లను కూడా విసురుతోందన్నారు. ఉపాధి మార్కెట్‌కు అంతరాయం కలగకకుండా సానుకూలంగా ఉపయోగించేలా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని పేర్కొన్నారు. చాట్‌జిపిటి కంటే మరింత శక్తివంతమైన ఎఐని సృష్టించే సామర్థ్యం ఓపెన్ ఎఐకి ఉందని ఆల్ట్‌మాన్ వెల్లడించాడు. కానీ ఆ టూల్స్ ఇప్పట్లో విడుదల చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఊహించని పరిణామాలను ఎదుర్కోవడం కష్టంగా ఉందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పట్ల భారత్ కూడా ఉత్సాహంగా ఉండటం ప్రశంసనీయమన్నారు. దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్స్‌కు సపోర్ట్ ఇవ్వడానికి ఓపెన్‌ఎఐ ప్రణాళికలను రూపొందిచామన్నారు. కత్రిమ మేధ కేవలం మానవ ప్రయత్నాలకు తోడ్పడుతుందని, ఉద్యోగాలను భర్తీ చేయదని కొద్ది మంది నిపుణులు అభిప్రాయపడుతుండగా.. ఆల్ట్‌మన్ మాత్రం ఉద్యోగాలు ఖచ్చితంగా ప్రభావితమవుతాయని స్పష్టం చేయడం ఆందోళకరం.

నేడు పిఎస్‌ఎల్‌వి సి-56 రాకెట్ ప్రయోగం

- సింగపూర్ ఉపగ్రహంతో పాటు ఆరు నానో ఉపగ్రహాలు
- కౌంట్‌డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఇస్రో మరో వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఆదివారం ఉదయం 6:31 గంటలకు మొదటి ప్రయోగ వేదిక నుంచి పిఎస్‌ఎల్‌వి సి-56 (పోలార్ సాటిలైట్ లాంచ్ వెహికల్) రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన డిఎస్-సార్ అనే ఉపగ్రహంతో పాటు మరో ఆరు నానో ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇస్రో అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేసింది. సింగపూర్‌కు చెందిన వివిధ ప్రయివేటు కంపెనీలకు సంబంధించిన నానో ఉపగ్రహాలలో వేలోక్స-ఎఎం, ఆర్కేడ్, స్కూబీ, న్యూ లైన్, గాలాసియా-2, ఓఆర్‌బి-12, స్ట్రీడర్ ఉపగ్రహాలు ఉన్నాయి. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో ఇది 58వ ప్రయోగం. ఇప్పటి వరకూ 92 రాకెట్లను, 34 దేశాలకు చెందిన 424 ఉపగ్రహాలను వాణిజ్య పరంగా ప్రయోగించింది. కౌంట్‌డౌన్‌ను శనివారం ఉదయం 5.10 నిమిషాలకు ప్రారంభమై ఆదివారం ఉదయం 6.31నిమిషాలకు రాకెట్ ప్రయోగం జరగనుంది.

శేషాచలం, నల్లమలను కలుపుతూ కారిడార్

- అంతర్జాతీయ పులుల దినోత్సవ సభలో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి)

పులుల సంఖ్య పెరిగితే అటవీ సంపదకు రక్షణ ఉంటుందని రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. 2010లో 45 పులులు ఉంటే నేడు 80కి పెరిగాయని, దీంతో శేషాచలం, నల్లమల అభయారణ్యాలను కలుపుతూ కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్లోబల్ టైగర్ డే వేడుకలను శనివారం తిరుపతి ఎస్‌వి జూ పార్క్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పులుల సంరక్షణకు రష్యాలో జరిగిన సమావేశంలో బీజం పడిందన్నారు. ఆనాటి నుండి ప్రతి ఏడాదీ జులై 29న గ్లోబల్ టైగర్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. నల్లమల, శేషాచల అభయారణ్యయాలను కలుపుతూ కారిడార్ ఏర్పాటు చేయడంతో నల్లమలలో ఉన్న పెద్ద పులులు ఇక్కడికి రావడానికి వీలుంటుందని చెప్పారు. శ్రీశైలం నాగర్జునసాగర్ టైగర్ జోన్ ప్రస్తుతం ఎనిమిది లక్షల ఎకరాల్లో ఉందని, దీనికి మరో ఐదు లక్షల ఎకరాలు పెంచేలా సిఎం ప్రతిపాదనలు చేశారని తెలిపారు. టైగర్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అటవీ సంరక్షణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

అంగడి సరుకుగా వైద్య విద్య: ధూళిపాళ్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్య తరగతి వర్గాలకు చెందిన బడుగు, బలహీన విద్యార్థులకు దక్కాల్సిన వైద్య విద్య సీట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగడి సరుకుగా మార్చారని టిడిపి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాల్సిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని వైద్య విద్య సీట్లను అమ్మకానికి పెట్టారని విమర్శించారు. ఎన్ఆర్ఐ, మేనేజ్‌మెంట్ కోటా పరిధిలోని సీట్లను రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షలుగా నిర్ణయించి వేలంపాట పెట్టారని తెలిపారు. జగన్ నిర్ణయంతో ప్రతిభ, రిజర్వేషన్లు ఆధారంగా గతంలో లభించే వైద్య విద్య సీట్లు ఇకపై లభించవన్నారు. పేదలకు, పెత్తందారులకు యుద్ధం జరుగుతోందని చెబుతున్న జగన్ బిసిలు, మైనార్టీలు, దళిత విద్యార్థులకు దక్కాల్సిన వైద్య విద్య సీట్లు అమ్ముకోవడం ఏ కోవకు వస్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీట్ల అమ్మకానికి సంబంధించిన జిఓలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68